

అప్పన్నకు పెళ్లి కుదిరింది

సంప్రదాయబద్ధంగా డోలోత్సవం

- ఏప్రిల్ 8న వార్షిక తిరుకల్యాణ మహోత్సవం
- 30న పెళ్లిరాట ఉడుపు ఉత్సవం

-7లో



సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం ఆదివివారం, తదితర ఏడు గ్రామాల గ్రామ దేవత, అప్పన్న సహోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె శ్రీమహాలక్ష్మితో నిశ్చయమైంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చైత్ర మాస శుక్లపక్ష ఏకాదశి నాడు అనగా ఏప్రిల్ 8న సింహాద్రినాథుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవం జరగను న్నది. అంతకుముందు చైత్రమాస పాడ్యమి అంటే... ఈ నెల 30న ఉగాదినాడు పందిరిరాట ఉత్సవం నిర్వహిస్తారు.

హే రంగులే...



అంబరాన్నంటిన హోలీ సంబరాలు

ఆక్సిజన్ టవర్స్‌లో సంబరాలు



విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం రంగుల పండుగ హోలీని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ... ఉత్సాహంగా గడిపారు. నగర పరిధిలోని పోర్టు స్టేడియం, ఎంజీఎం గ్రౌండ్‌తో పాటు పార్క్, రాడిసన్ బ్లూ హోటళ్లలో ప్రత్యేకంగా వేడుకలను నిర్వహించారు. అలాగే ఆర్కే బీచ్, రుషికొండ బీచ్‌లలో నగరవాసులు ముఖ్యంగా యువతీ యువకులు ఆనందోత్సాహాలతో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పిల్లలు బెలూన్స్ ఎగురవేస్తూ, వాటర్ గన్స్‌తో రంగు నీళ్లు చల్లుకుంటూ ఆనందించారు. అపార్టుమెంట్లలో హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. హోలీని పురస్కరించుకుని మార్వాడీలు ఆర్కే బీచ్‌లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం హోలీ సంబరాలను జరుపుకున్నారు.

గోల్‌మాల్!

ముంబైకు చెందిన 'సుహానీ' సంస్థపై సూపర్ బజార్ అధికారుల అవ్యాజ ప్రేమ



కో-ఆపరేటివ్ స్టోర్స్ (సూపర్‌బజార్) స్థలంలో నిర్మించిన మాల్

- ఆపరేషన్ ప్రారంభమైనా లేకపోయినా 2009 నుంచి డెవలప్‌మెంట్ ప్రీమియం (ఏడీపీ) వసూలు చేయాల్సిందిగా ఎపిట్కో సూచన
- 30 ఏళ్లలో రూ.9.3 కోట్లు వస్తుందని అంచనా
- ప్రైవేటు సంస్థ యాజమాన్యంతో స్థానిక అధికారుల కుమ్మక్కు
- ఏడీపీ చెల్లింపునకు నాలుగేళ్లు మినహాయింపు, ఫీజు భారీగా తగ్గింపు
- విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌కు రూ.4.27 కోట్ల నష్టం
- ప్రభుత్వం అనుమతి లేకుండానే చేశారని ఎండీపై ఫిర్యాదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సహకార శాఖలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లాలో కొత్త ఆఫీసుకు అవసరమైన ఫర్నీచర్ కోసం సిబ్బంది నుంచి రూ.7,900 ఫోన్ పే ద్వారా థర్డ్ పార్టీకి ఇప్పించారనే ఆరోపణతో అక్కడి సహకార శాఖాధికారిని సస్పెండ్ చేశారు. విశాఖపట్నం జిల్లా సూపర్ బజార్‌లో వందల కోట్ల రూపాయల ఆస్తిని అడ్డగోలుగా ఓ కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టి భారీ నష్టం కలిగించిన అధికారిపై మాత్రం ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు లేవు. విచారణ చేయిస్తున్నామని చెబుతున్న ఉన్నతాధికారులు...ఆ అధికారిని అదే సీట్లో ఇంకా కొనసాగిస్తున్నారు. రికార్డులు మార్చేసి చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు అవకాశం ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజార్) వన్‌టౌన్‌లోని తన ప్రాంగణంలో 3,972 చ.గ. స్థలాన్ని సుహానీ మాల్ మేనేజ్‌మెంట్‌కు బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) విధానంలో 2005లో లీజుకు ఇచ్చింది. పీపీపీలో చేపట్టిన ఈ



ప్రాజెక్టుకు హైదరాబాద్‌లోని ఎపిట్కోని నోడల్ ఏజెన్సీగా పెట్టుకున్నారు. లీజు అగ్రిమెంట్ నుంచి ప్రాజెక్టు పూర్తి చేసేంత వరకూ ఏ సమయంలో ఏమి చేయాలో 'ఎపిట్కో' సూచించింది. దాని ప్రకారం సూపర్ బజార్ ముందుకువెళ్లాలి. డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ అగ్రిమెంట్‌కు ఎపిట్కో చేసిన ఒప్పందంలో ఆర్టికల్ 2.4 ప్రకారం అడిషనల్ డెవలప్‌మెంట్ ప్రీమియం (ఏడీపీ)ని ప్రాజెక్టు ఆపరేషన్ ప్రారంభమైనా లేకపోయినా సరే 28.2.2009 నుంచి వసూలు చేయాలి. ఇలా మొత్తం 30 ఏళ్ల వసూలు చేయాలని, ఏ ఏడాది ఎంత వసూలు చేయాలో నిర్ణీత మొత్తాలతో సహా ఆనాడే నివేదించింది. మొత్తం 30 ఏళ్లకు రూ.9.3 కోట్లు డెవలపర్ చెల్లించాలని పేర్కొంది. అయితే సుహానీ మాల్ పలు కారణాలు చూపిస్తూ ఏడీపీ తగ్గించాలని కోరగా, అప్పట్లో సూపర్ బజార్‌కు మేనేజింగ్ డైరక్టర్‌గా వ్యవహరిస్తున్న అధికారి (ఇప్పుడు ఉన్నదీ ఆయనే) నాలుగేళ్లు మినహాయింపు ఇచ్చేశారు. వాస్తవానికి ఇలాంటి నిర్ణయాలు ఎండీ స్థాయిలో తీసుకోవడానికి వీల్లేదు. ప్రభుత్వానికి తెలియజేసి, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకోవాలి. కానీ సొంత

... మిగతా 6వ పేజీలో

నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

- పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాల నిర్వహణ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా శనివారం ఉమ్మడి జిల్లాల్లో పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి. ముకుందరావు తెలిపారు. శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో సైకిల్ ర్యాలీ, బీచ్ క్లీనింగ్ నిర్వహిస్తామన్నారు. అలాగే దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో చిననాగమయ్యపాలెంలో ప్లాస్టిక్‌చెత్త తొలగింపు, శ్రీహరిపురంలో కోరమాండల్‌లో పరిసరాల పరిశుభ్రత, పరవాడ ఫార్మాసిటీలోని విశాఖ ఫార్మా కంపెనీలో మొక్కలునాటే కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలు చేయాలని ఆయా కంపెనీల ప్రతినిధులకు సూచనలు చేశామన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.10
సహరి (ఆది)	4.48

ఉబర్ బాదుడు

ఛార్జీలు పెంచేసిన సంస్థ



- అదేబాటలో ర్యాపిడో...
- ఖరీదైన ఫోన్ల నుంచి బుక్ చేస్తే మరింత అధికం
- బుక్ చేసుకున్న వాహనం బదులు మరో వాహనం రాక

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మొదట్లో తక్కువ చార్జీలతో సేవలు ప్రారంభించిన 'ఉబర్, ర్యాపిడో' సంస్థలు ఇప్పుడు రేట్లు భారీగా పెంచేశాయి. ఇంతకు ముందు అంటే సుమారు నాలుగు నెలల క్రితం మద్దిలపాలెం డిపో ప్రాంతం నుంచి హనుమంతవాకలోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి, విమ్స్‌కు వెళ్లడానికి ఆటోలు రూ.56 నుంచి రూ.64 వరకు వసూలు చేసేవి. అటు నుంచి రూ.70 వరకు ఛార్జ్ చేసేవారు. ఇప్పుడు ఇటు నుంచి రూ.70, అటు నుంచి రూ.88 వసూలు చేస్తున్నారు. పైగా అటు నుంచి వచ్చేటపుడు ఎక్కువ ఛార్జీ కోసం ఆటోను ఇసుకతోట జంక్షన్ వద్ద యు టర్న్ తీసుకొని హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకటేశ్వర స్వామి గుడి వరకు వెళ్లి అక్కడ ఎడమ మలుపు తీసుకొని కేఆర్ఎం కాలనీకి వెళ్లి అక్కడి నుంచి మద్దిలపాలెం తీసుకువెళుతున్నారు. ఇసుకతోట నుంచి మద్దిలపాలెం రావడానికి చక్కటి హైవే ఉండగా, యూ టర్న్ తీసుకొని హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎం కాలనీ అంతా తిప్పుతున్నారు. దీనిపై డ్రైవర్లను ప్రశ్నిస్తే.. యాప్‌లో రూట్ ఎలా ఉంటే అలాగే వెళతామని సమాధానమిస్తున్నారు. ఇక్కడ రేట్లు పెంచడం ఒక సమస్య కాగా, మరొకటి నేరుగా గమ్యస్థానాలకు తీసుకువెళ్లకుండా చుట్టూ తిప్పడం.

గతంలో మద్దిలపాలెం నుంచి జడ్జి కోర్టు ఎదురుగా ఉన్న సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు, జగదాంబ సెంటర్‌కు వెళ్లడానికి రూ.60 నుంచి రూ.70 తీసుకునేవారు. ఇప్పుడు రూ.80 నుంచి రూ.98 వసూలు చేస్తున్నారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అక్కయ్యపాలెం ప్రాంతంలోని రామచంద్రానగర్‌కు ఆటోకు రూ.40 తీసుకునేవారు. ఇప్పుడు రూ.60 ఛార్జి వేస్తున్నారు. ర్యాపిడో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం నుంచి బైక్‌పై సీతమ్మధార రైతుబజారుకు వెళ్లడానికి రూ.40 వసూలు చేస్తోంది. ఇంతకు ముందు రూ.25కే వచ్చేవారు.

ఒక వాహనానికి బదులు మరో వాహనం

ఎవరైనా ఉబర్‌లో ఆటోలు, కార్లు, ర్యాపిడోలో బైక్ బుక్ చేసుకుంటే ఎక్కువసార్లు యాప్‌లో చూపించిన నంబరు వాహనం కాకుండా వేరే నంబరు కలిగిన వాహనం వస్తోంది. దీనిపై

... మిగతా 6వ పేజీలో



ఏయూ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వీసీ

విద్యార్థులతో కలిసి వీసీ భోజనం

- ఏయూ హాస్టళ్లలో నాణ్యత పరిశీలన
- ఆకస్మిక తనిఖీలు, తరచూ వార్డెన్లతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ క్యాంపస్‌లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నారు. వర్సిటీలో ఉన్న ఇరవైకి పైగా హాస్టళ్లలో వందలాది మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి నాణ్యమైన భోజనం అందించడం అధికారుల బాధ్యత. అయితే, అనేక హాస్టళ్లలో భోజనం బాగుండడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై

... మిగతా 6వ పేజీలో

పాఠశాలల అభివృద్ధికి నిధులు

'మన బడి-మన భవిష్యత్తు' పనులకు మోక్షం



చంద్రంపాలెం పాఠశాలలో అసంపూర్తిగా నిర్మాణం

- గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కింద చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా ఉన్నవైనం
- పూర్తి చేసేందుకు రూ.27 కోట్లు అవసరం
- ప్రస్తుతం రూ.1.2 కోట్లు విడుదల
- కనీసం రూ.10 కోట్లు అయినా ఇస్తే జూన్ నాటికి అదనపు తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావచ్చునంటున్న అధికారులు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు (మనబడి-మన భవిష్యత్తు) పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల ఒకటో తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెండింగ్ పనులకు నిధులు కేటాయించింది. ముందుగా జిల్లాల నుంచి పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు సమాచారం తీసుకున్నారు. కొన్ని పాఠశాలల్లో నిర్మించిన అదనపు తరగతి గదులకు ప్లాస్టింగ్ చేసి, పెయింట్ వేస్తే సరిపోతుందని, కొన్నిచోట్ల పాఠశాలలకు పెయింట్ వేయాల్సి ఉందని, అదనపు గదులకు తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉందని ఇంజనీర్లు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు పలు పాఠశాలల్లో పెయింటింగ్ పనులు చేపట్టారు. అయితే కనీసం పార్టు పేమెంట్ కూడా ఇవ్వకపోవడంతో పనులు మధ్యలో విడిచిపెట్టేశారు. అలాగే బిల్లులు ఇవ్వకపోవడంతో పాఠశాలలకు వచ్చిన తలుపులు, కిటికీలు బిగించకుండా మూలన పడేశారు. ఈ వివరాలతో సమగ్రశిక్షా అభియాన్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో తొలివిడత తాజాగా పాఠశాల అభివృద్ధి కమిటీ ఖాతాలకు రూ.1.2 కోట్లు విడుదల చేశారు. పెయింటింగ్ పనులు పూర్తిచేయడానికి సంబంధిత కంపెనీలకు నిధులు

... మిగతా 6వ పేజీలో

భూ మాయగాళ్లకు జైలు

- ఒకరికి విక్రయించిన స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లతో వేరొకరికి అమ్మిన ఏడుగురికి న్యాయస్థానం శిక్ష
- బాధితునికి రూ.2.9 లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశం

పెందుర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఒకరికి విక్రయించిన స్థలాన్ని తిరిగి ఆక్రమించుకోవడంతో పాటు నకిలీ డాక్యుమెంట్లతో వేరొకరికి అమ్మినట్టు తేలడంతో నిందితులు ఏడుగురికి ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జిల్లా అదనపు జడ్జి తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలు సీఐ కేవీ సతీశ్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడకు చెందిన పిలమాల అప్పారావు 2017 ఫిబ్రవరిలో పెందుర్తి సమీపంలోని దొగ్గవానిపాలెం సర్వే నంబర్ 107-23లో గల స్థలాన్ని కూడా అంజిలరావు, ఎం.మరిడయ్య, ఎం.రమణ, ఎం.గోవింద్, ఎం.రాంబాబు, ఎం.చిన మరిడయ్య, ఎం.సూరిబాబు అనేవారి వద్ద రూ.18 లక్షలకు కొనుగోలు చేశారు. స్థలాన్ని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. స్థలానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నారు. అయితే అదే స్థలాన్ని అంజిలరావు బృందం తప్పుడు పత్రాలతో వేరొకరికి విక్రయించింది. అప్పారావు స్థలాన్ని ఆక్రమించుకుని ప్రహరీ గోడను ధ్వంసం చేసింది. ఈ వ్యవహారంపై తనను మోసం చేశారని, కులం పేరిట దూషించారని

... మిగతా 6వ పేజీలో

పక్కాగా భూముల రీసర్వే

- నాలుగు గ్రామీణ మండలాల్లో మరో 8 గ్రామాలు ఎంపిక
- ఒక్కో గ్రామానికి ఆరేసి బృందాలు ఏర్పాటు
- తప్పులు దొర్లకుండా చూడాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు
- ఇప్పటికే మూడు గ్రామాల్లో రీసర్వే కొలిక్కి



దాకమర్రిలో రీసర్వే చేస్తున్న సర్వేయర్లు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని ప్రభుత్వం గట్టిగా ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని మూడు గ్రామాల్లో చేపట్టిన రీసర్వే పనులు చివరి దశకు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాలుగు గ్రామీణ మండలాల్లోని మరో ఎనిమిది గ్రామాల్లో రీసర్వేకు తాజాగా నిర్ణయించారు. ఈనెల 20వ తేదీ నుంచి ఎనిమిది గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించనున్నారు. పెందుర్తి మండలం పెదగాడి, పినగాడి, ఆనందపురం మండలం గిడిజాల, కుశలవాడ, భీమిలి మండలం తాటితూరు, తాళ్లవలస, పద్మనాభం మండలంలో పాండ్రంకితోపాటు మరో గ్రామాన్ని ఎంపిక చేశారు. ప్రతి గ్రామంలో భూముల రీసర్వేకు ఐదు బృందాలను, రైతులకు సమాచారం ఇవ్వడం, గ్రామ సభల నిర్వహణ, రైతులు, అధికారుల మధ్య సమన్వయం కోసం మరో బృందాన్ని నియమించారు. ప్రతి బృందంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఉంటారు. ప్రతి గ్రామంలో 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా గుర్తిస్తారు. ఆ 250 ఎకరాలకు సంబంధించిన రైతులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేస్తారు. బ్లాక్ పరిధిలో ఏ సర్వే నంబర్‌లోని భూములు ఏ రోజు రీసర్వే చేస్తారనే వివరాలను గ్రూపులో

... మిగతా 6వ పేజీలో

వైభవంగా ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రవచనాలు వినిపిస్తున్న శ్రవణా నంద చైతన్య చిన్న స్వామి

భీమునిపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భీమిలి వేంకటగిరిపై ఉన్న శ్రీపద్మావతి, గోదా సమేతశ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. తెల్లవారుజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి కొట్నాలోత్సవం, నవ కలశ స్నపన తిరుమంజనం అనంతరం, భీమిలి పవిత్ర గోస్తనీ సాగర సంగమంలో స్వామి చక్ర తీర్థోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో భక్తులు స్నానాలు ఆచరించారు. మధ్యాహ్నం మహానారాయణ సేవలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నెల్లిమర్ల శ్రీసమతానంద దుర్గా పీఠం శ్రీశ్రవణానంద చైతన్య చిన్నస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. సాయంత్రం ద్వాదశారాధనలు, నిత్య హోమాలు, ప్రాయశ్చిత్తహోమాలు, మహాపూర్ణాహుతి, అష్టదిక్పాలకు ఉద్వాసన, ధ్వజారోహణం, శ్రీ స్వామివారికి పుష్పయాగం, ఏకాంతసేవ ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు జీవీ అప్పలాచార్యులు, ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ప్రతినిధులు రేలంగి పెదబాబు, ఎం.సత్యానందరావు, కె.ముత్యాలరావు, జి.సన్యాసిరావు, జి.ఆనంద్, మొకర శంకర్, అంబటి శ్రీను, కల్యాణ్‌తో పాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా సముద్ర తీరం



సముద్ర స్నానాలు చేస్తున్న దృశ్యం

భీమునిపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భీమిలిలో శుక్రవారం హోలీ పండగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో హోలీ సంబరాలు ఆనందోత్సాహాలతో జరుపుకున్న అనంతరం, భీమిలి సాగరసంగమంలో సముద్రస్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా, పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా లక్ష్మీజయంతి వేడుకలు



ఒకే సింహాసనంపై కొలువుదీరిన అష్టలక్ష్ముల ఉత్సవ విగ్రహాలు

కొమ్మాది, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష్మీజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ సేవల అనంతరం లక్ష్మీనారాయణులకు అభిషేకం, లక్ష్మీహోమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఒకే సింహాసనంపై ఉంచి సామూహిక కుంకుమార్చనలు, సహస్ర దీపాలంకరణసేవ, సువర్ణ పుష్పార్చన, పుష్పాభిషేకం వైభవంగా నిర్వహించారు. ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు చూశారు.

ఇస్కాన్‌లో...

సాగర్‌నగర్: గౌరీపూర్ణిమ ఉత్సవాలు సాగర్‌నగర్ సమీపంలోని ఇస్కాన్ మందిరంలో శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవతామూర్తులకు సుమారు వందకేజీల పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. భజనలు సంకీర్తనలు ఆలపించారు. అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవనిలు ప్రవచనాలిచ్చారు.

ప్రధాన కూడళ్లలో రింగ్‌పోల్ లైట్లు

కొమ్మాది, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బోరవానిపాలెం, అంబేడ్కర్ కాలనీ, పీవీ2 కాలనీ, వికలాంగుల కాలనీ, స్వతంత్రనగర్, ఎన్టీఆర్ హుద్‌హుద్ కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు రూ.5 లక్షలతో ఏర్పాటుచేసిన రింగ్‌పోల్ లైట్లను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో ప్రధాన కూడళ్లలో ఈ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, బోయి రమాదేవి, కొండపురాజు, ఎలక్ట్రికల్ ఏ.ఇ గాయత్రి, కాలనీపెద్దలు పాల్గొన్నారు.

పద్మనాభంలో మజ్జిగ పంపిణీ

పద్మనాభం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని పద్మనాభం జంక్షన్‌లో శుక్రవారం మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బాటసారులు, ప్రయాణికులకు పీఠం సభ్యులు చల్లని మజ్జిగ, లస్సీలను పంపిణీ చేశారు. గురుస్వామి అల్తి రాజు, టీడీపీ నాయకుడు నమ్మి వెంకటరావు, ఇతర సభ్యులు సుందరరావు, బంగారాజు, నాగ పాల్గొన్నారు. మద్ది ధర్మశాస్తా పీఠంలో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో అనంతపద్మనాభుడి డోలోత్సవం

పద్మనాభం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలో ఆనందోత్సాహాలతో శుక్రవారం అనంత పద్మనాభుని డోలోత్సవం జరిగింది. కల్యాణోత్సవం అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత అనంతపద్మనాభుడు గ్రామంలోని ఉయ్యాల మండపంలో విహారానికి వెళ్లడమే ఈ ఉత్సవ ప్రత్యేకత. స్వామికి ప్రాతఃకాల సేవల అనంతరం స్థానిక కుంతీమాధవస్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా రూపొందించిన పల్లకీపై మంగళవాయిద్యాల నడుమ ఉభయ దేవేరులతో స్వామి వారిని ఉయ్యాల మండపానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం రంగులు చల్లుకొన్నారు.



చక్రపెరుమాళ్లు వారికి పంచామృతాభిషేకం



కన్నయ్య కోనేరులో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

అనంతరం స్వామివారిని కన్నయ్య కోనేరు వద్దకు తీసుకువచ్చి చక్ర పెరుమాళ్లవారికి పంచామృతాభిషేకాలు చేశాక చక్రస్నానం చేయించారు. శనివారం రాత్రి నిర్వహించే స్వామివారి సప్తార్ణవ సేవ, పుష్పాంజలితో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఎర్నాయుడు, పైడిరాజు, పద్దు, రాము, టీడీపీ నాయకుడు కె.నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవాలకు అందరూ సహకరించాలి

ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు

భీమునిపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భక్తులందరూ సహకరించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఉత్సవ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15 (శనివారం) అర్ధరాత్రి అమ్మవారి దేవర (చాటింపు) ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన భీమిలి గ్రామ దేవత శ్రీనూకాలమ్మ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని, ఈ విషయంలో రాజకీయాలకతీతంగా అందరూ నాయకులు ఐక్యతగా ముందుకు రావాలని కోరారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి యెచ్చర్ల హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాసి వినోద్‌కుమార్, కో-ఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు మాట్లాడారు. సమావేశంలో పట్టణ ప్రముఖులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, అల్లిపిల్లి నర్సింగరావు, కొండబాబు, ఎల్లాజి, లక్ష్మణరావు, అప్పలనాయుడు, అప్పన్న, కృష్ణ, కామేష్, సంజీవ్, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుబాబు

వసుంధర జ్యూవెలరీ ప్రదర్శన ప్రారంభం



వసుంధర డైమండ్ రూఫ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నగర పోలీసు కమిషనర్ సతీమణి సువ్రశ్రీ బాగ్చి

సాగర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అందమైన జ్యూవలరీ తయారీ వెనుక, వాటిని తీర్చిదిద్దే వారి నైపుణ్యం, ప్రతిభ, కష్టం దాగి ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అర్ధాంగి సువ్రశ్రీ బాగ్చి అన్నారు. వసుంధర డైమండ్ రూఫ్ ప్రారంభమై 28 సంవత్సరాలు, విజయవాడ శాఖ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నగరంలోని ర్యాడిసన్ బ్లూ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన జ్యూవలరీ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. మహిళలు మెచ్చే వివిధ డిజైన్లతో కూడిన ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. అన్ని రకాల ఆభరణాలను ఒకే చోట అందుబాటులో ఉంచిన వసుంధర డైమండ్ రూఫ్ నిర్వాహకులను సువ్రశ్రీ బాగ్చి అభినందించారు.వసుంధర డైమండ్ రూఫ్ విశాఖపట్నం నిర్వాహకులు తొట్టంపూడి శ్రీదేవి మాట్లాడుతూ శనివారం కూడా కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో సరికొత్త వెరైటీ బంగారు, డైమండ్ జ్యూవలరీ ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని తెలిపారు. ప్రతీ రూ2 లక్షల కొనుగోలుపై లక్కీడ్రా కూపన్ ఇస్తామన్నారు. విజేతలకు డైమండ్ ఫింగర్ రింగ్ బహుమతిగా ఇస్తామని శ్రీదేవి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పక్కాగా భూముల రీసర్వే

... 5వ పేజీ తరువాయి

పోస్టు చేస్తారు. ఇప్పటికే సర్వేయర్లు ప్రతి బ్లాకులో రైతుల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించే పనిలో ఉన్నారు. ఈ ఎనిమిది గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తిచేసిన సర్వే శాఖ రీసర్వేకు అంతా సిద్ధం చేసింది.

గొట్టిపల్లి, గంధవరం, దాకమర్రి గ్రామాల్లో కొన్ని వారాలుగా రీసర్వే జరుగుతోంది. జిల్లాలోని 85 రెవెన్యూ గ్రామాలకుగాను 59 గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో రీసర్వే పూర్తిచేశారు. మిగిలిన గ్రామాల్లో రీసర్వే పనులు పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా తప్పులు దొర్లకుండా సర్వేయర్లు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు.

భూ మాయగాళ్లకు జైలు

... 5వ పేజీ తరువాయి

అప్పట్లో పోలీసులకు అంజిలరావు, తదితరులపై అప్పారావు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి సీఐ జె.మురళీ కేసు నమోదు చేయగా, ఏసీపీ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసి చార్జిషీటు వేశారు. వెస్ట్ ఏసీపీ పృథ్వీరాజ్ పర్యవేక్షణలో సీఐ కేవీ సతీశ్‌కుమార్ సకాలంలో సాక్షులను ప్రవేశ పెట్టడం, కోర్టులో ఆధారాలను సమర్పించడంతో విక్రయించిన స్థలాన్ని ఆక్రమించుకుని తప్పుడు పత్రాలతో వేరొకరికి విక్రయించిన అంజిలరావు, మరిడయ్య, రమణ, గోవింద్, రాంబాబు, చిన మరిడయ్య, సూరిబాబులకు ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష విధించడంతో పాటు, వారి చేతిలో మోసపోయిన పిలమాల అప్పారావుకు ఒక్కొక్కరు రూ.2.9 లక్షల చొప్పున రూ.18.6 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించాలని కోర్టు తీర్పు వెలువరించినట్టు సీఐ తెలిపారు.

రూ.6.65 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు

దివీస్ ల్యాబొరేటరీస్ యాజమాన్యం దాతృత్వం

భీమునిపట్నం (రూరల్) మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోనితూడెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని దివీస్ ల్యాబొరేటరీస్ యాజమాన్యం రూ.6.65 లక్షలతో మరమ్మతులు చేయించింది. ఆధునికీకరించిన ఈ భవనాన్ని సర్పంచ్ జి.నర్సయ్యమ్మ శుక్రవారం ప్రారంభించారు ఈ కేంద్రంలో వంటగది, గచ్చు స్లాబ్‌కు మరమ్మతులు, రంగులు వేయించడం వంటి పనులు చేయించినట్టు దివీస్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త నారాయణమ్మ, దివీస్ ప్రతినిదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్సయ్యమ్మ

అందుబాటులోకి పబ్లిక్ టాయ్‌లెట్లు

భీమునిపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పాతబస్టాండ్‌లో లక్షలాదిరూపాయిలతో నిర్మించి మూడు నెలలుగా నిరుపయోగంగా పడివున్న పబ్లిక్ టాయ్‌లెట్లను జీవీఎంసీ అధికారులు శుక్రవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అధికారుల మధ్య సమన్వయ లోపం' శీర్షికన 'ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ టాయ్‌లెట్ల'పై కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవీఎంసీ జోనల్ అధికారులు శుక్రవారం పబ్లిక్ టాయ్‌లెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఉబర్ బాదుడు

... 5వ పేజీ తరువాయి

డ్రైవర్లను ప్రశ్నిస్తే...అది రిపేర్‌లో ఉందని, అందుకే వేరే దాంట్లో వచ్చామని చెబుతున్నారు. మరికొందరైతే... సంస్థ ఓటీపీని ఎంటర్ చేశాక ఓకే చేసిందంటే...రైడర్‌గా తమను ఆమోదించినట్టేనని, ఏ వాహనమైనా ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. అయితే అనుకోని ప్రమాదాలు, ఇతర ఘటనలు ఏమైనా జరిగితే...యాప్‌లో చూపించే వాహనం నంబరు, ఘటన జరిగిన వాహనం నంబరు వేరుగా ఉంటాయి. ఇది వినియోగదారుల భద్రతకు సంబంధించిన విషయం.

ఐఫోన్లు, శ్యామ్‌సంగ్ ఫోన్లకు అధిక ఛార్జీలు

మద్దిపాలెం డిపో ప్రాంతం నుంచి ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి వన్ ప్లస్ ఫోన్‌లో కారు బుక్ చేస్తే కేవలం రూ.124కే వస్తోంది. అదే శ్యామ్‌సంగ్ ఖరీదైన ఫోన్‌లో బుక్ చేస్తే రూ.156 చూపిస్తోంది. ఐఫోన్ల నుంచి చేసే బుకింగ్స్‌కు కూడా ఇదే విధంగా ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

నగదు ఇవ్వాలని డిమాండ్

ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పే వాడకం పెరగడంతో టీలు, టిఫిన్లు, రైతుబజార్లలో కూడా ఇలాగే చెల్లింపులు జరుగుతున్నాయి. కానీ 'ఉబర్' మాత్రం ప్రత్యేకంగా ఆటోలకు నగదు చెల్లించాలంటూ గత రెండు వారాలుగా ప్రత్యేక మెసేజ్‌లు పెడుతోంది. ఇక్కడ చిల్లర సమస్యలు వస్తున్నాయి. యాప్ ద్వారా చెల్లిస్తే సంస్థ నుంచి డ్రైవర్లకు సకాలంలో డబ్బులు రావడం లేదని, కమీషన్లపై వివాదాలు కూడా తలెత్తుతున్నాయని పలువురు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

గోల్‌మాల్!

... 5వ పేజీ తరువాయి

నిర్ణయంతో ఏడీపీ తగ్గింపు కోసం 29.10.2013న సప్లిమెంటరీ అగ్రిమెంట్ తయారుచేశారు. ఎపిట్కో లెక్కల ప్రకారం మొదటి ఏడాది 2009-10లో రూ.14 లక్షలు, అలా క్రమంగా ఏటా పెరుగుతూ చివరి సంవత్సరం 2038-39కి రూ.57.63 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ 30 ఏళ్ల ఏడీపీ ఆదాయం రూ.9.3 కోట్లు. ఎండీ చేసిన సప్లిమెంట్ అగ్రిమెంట్‌లో 2012-13 నుంచి ఏడీపీ వసూలు చేయాలని నిర్ణయించి ఆ విధంగానే ముందుకువెళ్లారు. ఆ ఏడాది రూ.10 లక్షలతో ప్రారంభించారు. చివరి ఏడాదికి వచ్చేసరికి ఆ మొత్తం కేవలం రూ.25.41 లక్షలకే పరిమితమైంది. ఆ కొత్త లెక్కల ప్రకారం సుహానీ మాల్ చెల్లించాల్సిన ఏడీపీ రూ.5.02 కోట్లకు పడిపోయింది. దీనివల్ల విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌కు రూ.4.27 కోట్లు నష్టం వచ్చింది. ఈ లెక్కలన్నీ చూపిస్తూ పలువురు ప్రభుత్వానికి వారం క్రితం ఫిర్యాదు చేశారు. గతంలో ఎండీగా పనిచేసినప్పుడు పలు తప్పులు చేశారని, ఇప్పుడు అదే పోస్టులో ఉంటూ వాటిని సరిదిద్దుకునేందుకు రికార్డులు మార్చాలని అకౌంటెంట్‌పై ఒత్తిడి పెడుతున్నారని, దాంతో అతను ఆత్మహత్యాయత్నం కూడా చేశారని, విచారణ చేయాలని వారు కోరారు. సంస్థ భూమిని బ్యాంకులో తనఖా పెట్టుకోవడానికి ఉద్దేశపూర్వకంగా సహకార శాఖాధికారులు అనుమతి ఇచ్చారనే అంశంపై విచారణ జరుగుతున్నందున ఎండీని ఆ స్థానం నుంచి తప్పించి, విచారణ పారదర్శకంగా జరిగేలా చూడాలని ఫిర్యాదులో కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికైనా సూపర్ బజార్‌లో ఏమి జరుగుతున్నదో పూర్తిగా దృష్టి పెట్టాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

... 5వ పేజీ తరువాయి

విడుదల చేయాలని ఆదేశాలు వెళ్లాయి.

వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్ల కిందట జిల్లాలోని 319 పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు (ప్రస్తుతం మన బడి-మన భవిష్యత్తుగా పేరు మార్చారు) కింద రూ.115.67 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. అయితే తొలి నుంచి నిధుల సమస్య వెంటాడింది. అనుకున్న సమయంలో పనులు పూర్తికాలేదు. కొన్నిచోట్ల మధ్యలో నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి భవనాలు వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.27 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. పెయింటింగ్ బకాయిలు ఆరు కోట్ల రూపాయలు వరకూ ఉన్నాయి. అదనపు తరగతి గదులు అందుబాటులోకి తీసుకురావడం కోసం తొలుత రూ.పది కోట్లు అవసరమని చెబుతున్నారు. తాజాగా విడుదల చేసిన రూ.1.2 కోట్లు ఏ మూలకు సరిపడవని పాఠశాలల అభివృద్ధి కమిటీలు వ్యాఖ్యానిస్తున్నాయి. కనీసం రూ.10 కోట్లు ఇస్తే వచ్చే జూన్‌కల్లా మధ్యలో నిలిచిన అదనపు గదులు అందుబాటులోకి వస్తాయని అంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు....మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి నిధులు విడుదల చేయించాలని పాఠశాలల అభివృద్ధి కమిటీలు కోరుతున్నాయి.

విద్యార్థులతో కలిసి వీసీ భోజనం

... 5వ పేజీ తరువాయి

వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రస్తుతం గెస్ట్ హౌస్‌లో ఉంటున్న ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు హాస్టల్ నుంచే భోజనం వెళుతోంది. విద్యార్థులకు వడ్డించే ఆహారాన్నే తనకు పంపించాలని ఆదేశాలు ఇచ్చిన ఆయన...సరిగా లేకపోతే మార్పులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును ఆయా హాస్టళ్లకు ఆయన చెల్లించనున్నారు. గడిచిన కొద్దిరోజుల నుంచి ఆయన ఒక్కో హాస్టల్ నుంచి భోజనం తెప్పించుకుంటున్నారు. ఇప్పటివరకూ ఇంజనీరింగ్, రీసెర్చ్ స్కాలర్స్ ఆర్ట్స్ కాలేజీలకు చెందిన హాస్టళ్ల నుంచి వచ్చిన భోజనాన్ని రుచిచేశారు. అయితే భోజనం బాగాలేదంటూ కొద్దిరోజుల కిందట విద్యార్థులు ఆందోళన చేయడంతో ఎప్పటికప్పుడు హాస్టళ్లను తనిఖీ చేసేందుకు ఆయన నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఆయన గడిచిన రెండు రోజులుగా వివిధ హాస్టళ్లకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నారు. ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నారు. ఇబ్బందులు ఉన్నచోట విద్యార్థులతో మెస్ కమిటీలు వేయడంతోపాటు భోజనం ఎలా ఉందన్న సమాచారాన్ని తెప్పించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, ఆయా హాస్టల్ వార్డెన్లతో ఎప్పటికప్పుడు సమావేశాలు పెట్టాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో హాస్టళ్ల నిర్వహణను గాడిలో పెట్టాలని యోచిస్తున్నారు.

సాగరతీరంలో ఉత్సాహంగా హోలీ వేడుకలు



రుషికొండ బీచ్‌లో హోలీ స్నానాలు చేస్తున్న యువత



ఎండాడలోని వైశాఖి స్కైలైన్‌లో సంబరాలు

సాగర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ సందర్భంగా శుక్రవారం రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు రంగులమయమయ్యాయి. యువత ఉత్సాహంతో తీరాలకు చేరుకుని పరస్పరం రంగులు పులుముకుని కేరింతలు కొట్టారు. రాడిసన్ బ్లూలో ఆనందోత్సవాలతో హోలీ చేసుకున్నారు. అన్ని ప్రాంతాల్లో చిన్నారులు సందడి చేశారు.

ఎండాడ: ఎండాడ వైశాఖి స్కైలైన్‌లో హోలీ సంబరాలు మిన్నంటాయి. స్కైలైన్ ఫ్లాట్‌ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాయి. ఫ్లాట్‌ఓనర్స్ అంతా ఒకే కుటుంబ సభ్యులుగా కలసి హోలీ రంగులతో ఉల్లాసంగా ఆడుకున్నారు. పరస్పరం రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు .సంబరాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగాయి.

మధురవాడ: మధురవాడ పరిసరాల్లో హోలీ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. మధురవాడ, మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, పోర్టుకాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం తదితర ప్రాంతాల్లో పలువురు బైక్‌లపై తిరుగుతూ రంగులు అద్దుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పౌర్ణమి పురస్కరించుకొని కొందరు భక్తులు సముద్రస్నానాలు ఆచరించి ఆలయాల్లో పూజలు చేశారు.

సింహాచలం: చెడుపై మంచి విజయానికి గురుతుగా జరుపుకునే హోలీ వేడుకలను 98వ వార్డు పరిధిలో వీధివీధినా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్త్రీపురుష, వయోభేదం లేకుండా రంగుల నీటిని ఒకరిపై మరొకరు కేరింతలు కొడుతూ జల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

చందనోత్సవానికి ముందస్తు ప్రణాళికలు



అప్పన్నను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం విజయవంతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు తెలిపారు. సింహాద్రినాథుని డోలోత్సవంలో శుక్రవారం ఆయన పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఉత్సవాలకు సంబంధించి ప్రణాళిక ఖరారుకు త్వరలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో విశాఖలో ప్రత్యేక సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. ఉగాదినాడు పందిరిరాట, తరువాత చైత్ర శుద్ధ ఏకాదశినాడు అనగా ఏప్రిల్ 8న స్వామివారి వార్షిక తిరుకల్యాణోత్సవం, 30న నిజరూప దర్శనం చందనయాత్రను సమష్టికృషితో విజయవంతం చేస్తామన్నారు. సింహగిరిపై రూ.54 కోట్లతో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

గుండెపోటుతో చిరుత మృతి



చిరుత (ఫైల్ ఫొటో)

ఆరిలోవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో 20 ఏళ్ల వయసు కలిగిన చిరుత గురువారం రాత్రి మృతిచెందినట్టు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సుధ అనే పేరు గల ఈ చిరుత 2008 జనవరి 30న తిమ్మాపురం వద్ద గల సుద్దకొండ సమీపంలో అటవీ శాఖ సిబ్బందికి చిక్కినట్టు చెప్పారు. సుద్దకొండ వద్ద దొరకడంతో సుధ అని పేరు పెట్టినట్టు ఆమె తెలిపారు. వార్థక్యం సమస్యలతో బాధపడుతున్న చిరుత గుండె పోటుతో మృతి చెందినట్టు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైందని క్యూరేటర్ వెల్లడించారు. సాధారణంగా అటవీ ప్రాంతంలో చిరుతలు సుమారు 12 నుంచి 15 సంవత్సరాలు మాత్రమే జీవిస్తాయన్నారు. జూ పార్కులో జంతువులకు ఆహారం, ఆరోగ్యపరంగా ప్రత్యేక సంరక్షణ ఉండడంతో జీవితకాలం కాస్త ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. కాగా, జూ పార్కులో ఇంకా రెండు చిరుతలు ఉన్నట్టు మంగమ్మ తెలిపారు.

నష్టంపై పోరాడే హక్కు

వస్తువు/సేవ కొనుగోలులో ఎదురయ్యే ఇబ్బందులపై ఫిర్యాదులకు అవకాశం



- అండగా నిలిచేలా వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం
- ప్రజలకు అవగాహన తప్పనిసరి
- నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

(విశాఖపట్నం/ సింహాచలం, ఆంధ్రజ్యోతి)

ఏదైనా ఒక వస్తువు/సేవ పొందినప్పుడు ఇబ్బంది ఎదురైతే కొనుగోలు చేసిన సంస్థ నుంచి సకాలంలో పరిష్కారాన్ని పొందేందుకు వినియోగదారులకు హక్కు ఉంది. వినియోగదారుల హక్కులపై చాలామందికి అవగాహన లేకపోవడంతో ఆయా సంస్థలు పట్టించుకోవు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా మార్చి 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2019 ప్రతి వినియోగదారుడికి అనేక హక్కులను కల్పిస్తోంది. ఈ ఏడాది స్థిరమైన జీవనశైలికి సరైన మార్పు థీమ్‌తో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



వినియోగదారుల హక్కుల ఉద్యమం అమెరికాలో 1920లో ప్రారంభమైంది. అదే ఏడాది వినియోగదారుల సంఘం ఏర్పాటయింది. ఆ తరువాత అనేక దేశాలకు విస్తరించింది. రాల్ఫ్ నాడార్‌ని వినియోగదారుల ఉద్యమ పితామహుడిగా పేర్కొంటారు. ఆయన కృషి ఫలితంగా అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వినియోగదారుల హక్కులకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1986లోవినియోగదారుల చట్టాన్ని రూపొందించింది. 1989లో మార్చి 15న వినియోగదారుల దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించింది.

ఇవీ హక్కులు..

వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2019 ప్రకారం కొనుగోలు చేసే వస్తువు/సేవపై ప్రతి వినియోగదారుడు హక్కు కలిగి ఉంటాడు. సదరు వస్తువు నిర్దేశిత కాలం వరకు పనిచేయకపోయినా, ఫిర్యాదులను పరిష్కరించడంలో సంస్థలు నిర్లక్ష్యం ప్రదర్శించినా హక్కులకు భంగం కలిగినట్టే. రుణాల మంజూరులో ఇబ్బందులు, వస్తువు కొనుగోలు, సర్వీస్‌లో సమస్యలు, ఆహార విక్రేత సంస్థల్లో నిర్లక్ష్యం వంటివన్నీ వినియోగదారుల హక్కుల భంగం కిందకు వస్తాయి. వీటిపై పోరాడి నష్టపరిహారాన్నిపొందడంతోపాటు ఆయా సంస్థలపై చర్యలు తీసుకునేలా చట్టం ఉంది. ఐఎస్‌ఐ మార్కు ఉన్న ఏ ఉత్పత్తి అయినా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌కు ఫిర్యాదు చేసే హక్కు వినియోగదారులకు ఉంది. ఆహార పదార్థాలు ఇతర ఉత్పత్తులైనా ఫిర్యాదుకు అవకాశముంది. బంగారం వస్తువులైనా, బిస్కెట్‌లైనా హాల్‌మార్క్ లేకపోతే ఫిర్యాదు చేయవచ్చు.

ఫోరంలో కేసు వేయొచ్చు..

వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లితే బాధిత వ్యక్తులు జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేయవచ్చు. విక్రేత/వ్యాపారి మోసం చేసినట్టు ఆధారాలు ఉండాలి. వస్తు, సేవకు బిల్లు, గ్యారంటీ, వారంటీలుండాలి. ఎవరిపైన ఫిర్యాదు చేస్తున్నామో వారికి విషయాన్ని తెలియజేయాలి. అప్పటికీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే కేసు వేయవచ్చు. ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో న్యాయం జరిగేలా చూస్తారు.

చట్ట పరిధిలో సంస్థలు

వినియోగదారుల హక్కుల చట్టం పరిధిలో బ్యాంకులు, ప్రైవేట్ కంపెనీలు, కొన్ని ప్రభుత్వ సంస్థలు, జీవిత బీమా, విత్తనాల కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీలు వంటివి ఉన్నాయి. నగదు చెల్లించి వస్తువులు, సేవలను ఉపయోగించుకునే ప్రతి ఒక్కరూ వినియోగదారుడు కిందకు వస్తారు.

వినియోగదారుల ఫోరం పరిధి

జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మూడు వినియోగదారుల ఫోరాలున్నాయి. నష్టపరిహారం కోసం జిల్లా ఫోరంలో రూ.20 లక్షల వరకు, రాష్ట్ర కమిషన్ రెండు కోట్లు వరకు, జాతీయ కమిషన్‌లో రెండు కోట్లు దాటిన కేసులను నమోదు చేయవచ్చు. రూ.5 లక్షల లోపు విలువజేసే కేసులకు రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. దాటితే కొంతమొత్తం చలనా తీయాలి.

భారీగా నష్ట పరిహారాలు..

జిల్లాలో ఈ ఏడాది 81 కేసులు నమోదయ్యాయి. రిలయన్స్ సంస్థలో రూ.1.77 లక్షలు విలువజేసే ల్యాప్‌టాప్ కొనుగోలు చేసిన వ్యక్తి ఇబ్బంది ఉందని ఫిర్యాదు చేస్తే సంస్థ స్పందించలేదు. దీంతో కేసు వేయగా ఫోరం ఆరు శాతం వడ్డీతో సహా రూ.2.14 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. మరో కేసులో ఒక వ్యక్తి రూ.1.36 లక్షలు పెట్టి స్కూటీ కొనుగోలు చేశాడు. సర్వీస్ చేయించేందుకు సంస్థను ఆశ్రయించగా కొన్ని నెలలపాటు స్కూటీని వారి వద్దే ఉంచుకున్నారు. దీనిపై నష్టపరిహారం, కాలం, స్కూటీ కొనుగోలు చేసిన మొత్తం కలిపి రూ.2.9 లక్షలు చెల్లించాలని ఫోరం ఆదేశించింది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. చాలా మందికి అవగాహన లేక నష్టపోయినా మిన్నకుంటున్నారు. నష్టాన్ని భర్తీ చేసుకునే అవకాశం ప్రతి వినియోగదారుడికీ ఉంది. అవగాహన ఉంటేనే పోరాటం చేసేందుకు వీలుంటుంది. దేశ వ్యాప్తంగా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏటా వందలాది మంది వినియోగదారుల పక్షాన పోరాడుతున్నాం.

- డాక్టర్ వికాస్ పాండే, వినియోగదారుల హక్కుల కౌన్సిల్ జాతీయ ప్రెసిడెంట్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే పల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి రూ.10వేల కోట్ల సాయం తెచ్చామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అగనంపూడి వద్ద టోల్‌గేటు తొలగించామన్నారు. గుంతలు లేని రహదారులను చూస్తున్నామన్నారు. ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ కమిటీ ధర్నా అడ్డగింత

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాతగాజువాకలో తలపెట్టిన ధర్నాకు అనుమతి లేదంటూ కార్మిక సంఘ నాయకులను స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాతగాజువాక జంక్షన్‌లో ధర్నా చేపట్టాలని నాయకులు నిర్ణయించారు. పోలీసులు పేర్కొంటూ అడ్డుకున్నారు. దీంతో కార్మిక నాయకులు కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నిరసనచేపట్టారు. అరెస్టైన వారిలో డి.ఆదినారాయణ, కేఎస్ఎన్.రావు, రామస్వామి, సుబ్బయ్య, పల్లా పెంటారావు, కామేశ్వరరావు ఉన్నారు.

పరిహారం చెల్లింపునకు కృషి: ఎమ్మెల్యే బండారు

పెందుర్తిరూరల్, మార్చి 14: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి రైతులకు హామీ ఇచ్చారు. చింతలఅగ్రహారం, చీమలాపల్లి, పొర్లుపాలెం ప్రతినిధులు శుక్రవారం వెన్నెలపాలెంలోని బండారును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పి.వెంకటరమణ, గల్లా వెంకటరమణ, పెంటకోట రమణ, కొణతాల సూర్యనారాయణ ఉన్నారు.

'పూర్తిస్థాయి ఉత్పత్తితోనే ఉక్కు ప్రగతి'

కూర్మన్నపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయి ఉత్పత్తి, సొంత గనులు కేటాయింపుతోనే ఉక్కు ప్రగతి ఆధారపడి ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు జె.అయోధ్యరామ్ అన్నారు. కూర్మన్నపాలెంలో రిలే దీక్షలు 1,500వ రోజుకు చేరడంతో అఖిలపక్ష కార్మికులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీని బ్యాంకులు జమ చేసుకున్నాయన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా వేతన బకాయిలను చెల్లించాలన్నారు. గ్రేటర్ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు నాయకులు రమణమూర్తి, శ్రీనివాసరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు. దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ సీఐలు కె.మల్లేశ్వరరావు, ఇ.కేశవరావు ఆధ్వర్యంలో ధర్నా శిబిరం వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుడి మృతి



ట్రాక్టర్‌పైనే మృతిచెందిన సూర్య వెంకటరమణ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు గుండెపోటుతో ట్రాక్టర్‌పైనే మృతి చెందాడు. మాడుగుల ఘాట్‌రోడ్డు ప్రాంతానికి చెందిన వి.సూర్యవెంకటరమణ (47) సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్ నడుపుతుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సమీపంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటరమణను అంబులెన్స్‌లో ప్లాంట్‌నుంచి తీసుకువెళ్తున్న క్రమంలో గేటు వద్ద మృతుని కుటుంబీకులు అడ్డుకొని మృతదేహాన్ని దింపి న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చలు జరపగా రూ.2 లక్షల నష్టపరిహారంతో పాటు దహన ఖర్చుల కింద మరో రూ.33వేలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎన్ఏడీ జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్‌లో రూ.50 లక్షలతో చేపట్టనున్న రహదారి, కాలువ పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వక పనులు జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం, ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తోందన్నారు. ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మాణిక్యం, శ్రీను, సతీష్, పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిశీలన

వేపగుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 93వ వార్డు పరిధి అంజనాద్రికాలనీ, శివారుకాలనీలను కార్పొరేటర్ రాపర్తికన్నా శుక్రవారం పరిశీలించారు. రోడ్డు, కాలువల పరిస్థితులను పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. సంపత్, శ్రీను, రావు, రాము, కనక మహాలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

అగనంపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. గల్లావానిపాలెం, వేపచెట్టు జంక్షన్, కేఎస్ఎన్‌రెడ్డినగర్, ప్రశాంతినగర్, జగన్నాథస్వామి ఆలయంప్రాంతాల్లో శుక్రవారం హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు.రుద్రకుమార్, సూర్యనారాయణ, సింగిడి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్** : సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా** : జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం** : సంగం, శారద, కిన్నెర,
- **మజాకా** : రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్** : జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్** : మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహినికాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు42, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 34 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 56, అల్లం 50, బరబాటి 36, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 28, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 52, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

రైతుల నిరసనకు సీపీఐ నేతల సంఘీభావం



నిరసన దీక్షలో పాల్గొన్న సీపీఐ నాయకులు

పెందుర్తిరూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాగులోని భూముల స్వాధీనానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా పొర్లుపాలెం, చీమలాపల్లి, చింతలగ్రహారం, లక్ష్మీపురం రైతులు చేపట్టిన ఆందోళన శిబిరాన్ని శుక్రవారం సీపీఐ నేతలు సంఘీభావం తెలిపారు. పొర్లుపాలెంలో ఏర్పాటుచేసిన శిబిరంలో సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాసరావు, ఎర్రిపిల్లి రాంబాబు సమీక్షించారు. రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. రైతుల అనుభవంలో ఉన్న భూములు సింహాచలం దేవస్థానానికి చెందినవని అధికారులు చెప్పడం సరికాదన్నారు. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో భూములు కోల్పోనున్న రైతులకు అనుభవ హక్కుగా గుర్తించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసిరినాయుడు, అన్నపూర్ణ, అరుణ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించడమే లక్ష్యం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధమే సత్యసాయి సేవా సమితి లక్ష్యమని ఆ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఉచిత జూట్‌బ్యాగ్ శిక్షణముగింపులో మాట్లాడారు. ఆసక్తి గల వారికి జూట్ బ్యాగ్‌లతయారీలో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పీఆర్ఎస్.నాయుడు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న డోలోత్సవం

- ఆనందోత్సాహాల నడుమ చూర్ణోత్సవం



స్వామివారికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా నిర్వహించే డోలోత్సవం శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న సహోదరి పైడితల్లి అమ్మవారి కు మార్తె శ్రీమహాలక్ష్మితో వివాహం నిశ్చయమైంది. చైత్రమాస శుక్లపక్ష ఏకాదశి ఏప్రిల్ 8న సింహాద్రినాథుని వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. చైత్రమాస పాడ్యమి ఈనెల 30న ఉగాది రోజున పందిరిరా ట వేస్తారు. ఉదయం కొండదిగువన అప్పన్న పెళ్లిచూపులు జరిగాయి. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పెళ్లికుమారిడిగా తీర్చిదిద్దారు. బేడా మండపంలో తిరువీధి అనంతరంచూర్ణాలతో ప్రదక్షిణలు చేశారు. మూలవిరాట్ వద్ద యోగానంద నారసింహునికి, బేడా మండపంలోని సింహవల్లీ తా యార్, ఆండాళ్ అమ్మవారు, లక్ష్మీనారాయణులు, ఆళ్వా రుల సన్నిధిలో చూర్ణాలతో పూజలు చేశారు. తరువాత స్వామివారిని మెట్ల మార్గంలో బోయీలు మోసుకొచ్చారు. కొండదిగువ తొలిపావంచా వద్ద అధికారులు, భక్తు లు ఆహ్వానం పలికారు. అక్కడి నుంచి పైడితల్లి అమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. తనతో వివాహానికి ఆ మె కుమర్తెను కోరగా అందుకు తొలుత తిరస్కరించి, ఎట్టకేలకు సమ్మతించడంతో అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి, ఉద్యాన మండపంలో బంధుమిత్రులతో స్వామి ఆనందాన్ని పంచుకున్న ఘట్టాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని డోలిక(ఊయల)లో ఉంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము జరిపి పూజలు చేశారు. నాలుగు రకాల చూర్ణాలను మిశితం చేసి తొలుత స్వామివారిపై చల్లారు. పెళ్లి ప్రకటనగా పంచదార శీతలం (పానకాన్ని) నైవేద్యంగా సమర్పించి భక్తులకు తీర్థంగా పంపిణీ చేశారు. అనంతరం మాడవీధుల్లో పల్లకిలో తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పీవీ నరసింహం, ఈవో కె.సుబ్బారావు దంపతులు, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు రమణాచార్యులు, హవాల్దార్ గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అలంకారి కరి సీతారామాచార్యులు, వేదపండితులు కపిలవాయ్ అగ్నిరామకుమార్, రామయణం జగన్మోహనశర్మ, గోదావరి సురేశ్, ఘనాపాఠి సుబ్రహ్మణ్యశర్మ, ఈఈ రాంబాబు, ఏఈఓ ఆనందకుమార్ పాల్గొన్నారు.

స్వర్ణ నూకాంబికకు ఘనంగా సారె సమర్పణ



అమ్మవారి సారెతో ఆలయంలో మహిళలు

పెదగంట్యాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దయాళ్‌నగర్ లోవలోని స్వర్ణనూకాంబికా అమ్మవారికి స్థానిక మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సారె ఊరేగించిన అనంతరం అమ్మవారికి సమర్పించారు. పిండివంటలు, పసుపు కుంకుమ, వస్త్రాలు సమర్పించారు.

'ఉక్కు' ఎస్ఎంఎస్‌లో ప్రమాదం: ఉద్యోగికి గాయాలు



గాయపడిన పెంటయ్య

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఉద్యోగికి గాయాలయ్యాయి. ఎస్ఎంఎస్-2 కన్వర్టర్స్‌లో హాట్ మెటల్ ఉష్ణోగ్రత చెక్ చేసే సమయంలో ఒక్కసారిగా స్లాగ్ తుళ్లింది. ఉద్యోగి బలిరెడ్డి పెంటయ్యపై స్లాగ్ పడటంతో గాయపడ్డాడు. అతడిని వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

'సామాజిక సేవలో షిప్‌యార్డు ముందంజ'



శిబిరంలో పాల్గొన్న షిప్‌యార్డు అధికారులు

మల్కాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు సామాజిక సేవతో మన్ననలు పొందుతోందని షిప్‌యార్డు షిప్ బిల్డింగ్స్ డైరెక్టర్ గంటా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇఎస్ఐ ఆస్పత్రిలో షిప్‌యార్డు యజమాన్యం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలకు గర్భాశయ క్యాన్సర్ సోకకుండా సెర్వావాక్ వ్యాక్సిన్ వేసింది. 40 ఏళ్లు నిండిన మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈఎస్ఐ సూపరిటెండెంట్ రమణమూర్తి, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి మూర్తి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానించాలి

- విజయవాడలో విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ మోసపూరితమని, సొంత గనులు, నిర్వహణ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయవద్దంటూ అసెంబ్లీలో తీర్మానించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్రం ఇచ్చిన నిధులు కేవలం బకాయి వేతనాలు చెల్లించడానికే సరిపోతాయన్నారు. ఉక్కు రక్షణ కోసం ప్రజలు, ట్రేడ్ యూనియన్లు దీర్ఘకాలంగా పోరాడుతున్నా పట్టించుకోకుండా అనకాపల్లిలో మరో ప్రైవేటు స్టీల్‌ప్లాంట్ మిట్టల్ కంపెనీకి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడాన్ని తప్పుబట్టారు. రాజకీయలకు అతీతంగా విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, జేఏసీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్ మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.

వాడవాడలా సందడిగా హోలీ పండగ

ఉక్కుటౌన్‌షిప్, మర్చి 14 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో హోలి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యువత రంగులు చల్లుకున్నారు. విద్యార్థులు నివాసముంటున్న ప్రాంతంలోనే వేడుకలు జరుపుకున్నారు. ఒకరికొకరు హోలి శుభాకాంక్షలు తెలిపారు. కొంతమంది డీజే సౌండ్స్‌కు ప్రయత్నించినా పోలీసులు అనుమతించలేదు.

గోపాలపట్నంలో...

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసరాల్లో హోలీ ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి వీధుల్లో బాలలు, యువకులు రంగులు పూసుకుని ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. 89వ వార్డులోని ఎల్లపువానిపాలెం, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో నివశిస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఉద్యోగుల కుటుంబీకులు హోలీ ఘనంగా నిర్వహించారు.

షీలానగర్‌లో...

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 68, 69 వార్డుల్లో హోలీని ఘనంగా జరిపారు. భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో యువకులు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అక్కిరెడ్డిపాలెం, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, తుంగ్లాం, మిండి కాలనీలలో యువకులతో పాటు పిల్లలు రంగులు చల్లుకున్నారు.



గాజువాకలో హోలీ సంబరాలు



భెల్ టౌన్‌షిప్‌లో చిన్నారుల హోలీ సందడి

కణితిలో...

ఆటోనగర్: కణితిలో హోలీలో భాగంగా రంగులు చల్లుకొని ఉత్సవాలు జరుపుకున్నారు. పలువురు వీధులో తిరుగుతూ సందడి చేశారు.

పెదగంట్యాడ ప్రాంతంలో ...

పెదగంట్యాడ హెచ్‌బీకాలనీ, బర్మాకాలనీ, రామచంద్రానగర్ ప్రాంతాల్లో గృహిణులు రంగులు పూసుకుంటూ సరదాగా గడిపారు. పిల్లలు, యువకులు వీధుల్లో సందడి చేశారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

సీతమ్మధార/కంచరపాలెం/జ్ఞానాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జన సైనికులు, వీర మహిళలు, అభిమానులు శుక్రవారం సీతమ్మధార, కంచరపాలెం, జ్ఞానాపురం ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్పొరేటర్లు వసంత లక్ష్మీ, కందుల నాగరాజు, శివప్రసాద్ రెడ్డి, వార్డుల అధ్యక్షులు, పాల్గొన్నారు. జ్ఞానాపురం, అల్లిపురం, గవర కంచరపాలెం నుంచి పెద్ద సంఖ్యలో జనసైనికులు పిఠాపురం సభకు వెళ్లారు. జీవీఎంసీ 56వ వార్డులో పవన్ అభిమాని చదరం సంతోష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. వార్డులో జనసేన జెండాలు ఎగురవేసి కేకులు కోసి సంబరాలు చేశారు.

జూలో చిరుత గుండెపోటుతో మృతి


చిరుత (ఫైల్ ఫొటో)

ఆరిలోవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో 20 ఏళ్ల వయసు కలిగిన చిరుత గురువారం రాత్రి మృతిచెందినట్టు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సుధ అనే పేరు గల ఈ చిరుత 2008 జనవరి 30న తిమ్మాపురం వద్ద గల సుద్దకొండ సమీపంలో అటవీ శాఖ సిబ్బందికి చిక్కినట్టు చెప్పారు. సుద్దకొండ వద్ద దొరకడంతో సుధ అని పేరు పెట్టినట్టు ఆమె తెలిపారు. వార్ధక్యం సమస్యలతో బాధపడుతున్న చిరుత గుండెపోటుతో మృతి చెందినట్టు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైందని క్యూరేటర్ వెల్లడించారు. సాధారణంగా అటవీ ప్రాంతంలో చిరుతలు సుమారు 12 నుంచి 15 సంవత్సరాలు మాత్రమే జీవిస్తాయన్నారు. జూ పార్కులో జంతువులకు ఆహారం, ఆరోగ్యపరంగా ప్రత్యేక సంరక్షణ ఉండడంతో జీవితకాలం ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. జూ పార్కులో ఇంకా రెండు చిరుతలు ఉన్నట్టు మంగమ్మ తెలిపారు.

వినియోగదారుల హక్కులపై రైతులకు అవగాహన

అక్కయ్యపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నరసింహనగర్ రైతుబజారులో రైతులకు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ మర్రి సత్యనారాయణ అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల హక్కులు, ప్రభుత్వ పథకాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌ల రాష్ట్ర మహాసభలు నేడు, రేపు

మహారాణిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విశాఖలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు యూనియన్ సంయుక్త కార్యదర్శి యూఎస్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం సిటు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఐదుశాతం ఆరోగ్యం కోసం కేటాయించాలని, నాసిరకం మందులు, నల్లబజార్లలోనూ, ఆన్‌లైన్‌లోనూ ఔషధాల అమ్మకం నిరోధించాలని, మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు పి.వి.సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సంజయ్‌కుమార్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ఈకే ప్రతిరూపం జగద్గురు పీఠం: రామారావు


కుట్టుమిషన్లు అందుకున్న మహిళలతో అతిథులు

అక్కయ్యపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసంఖ్యాక ప్రజలకు ఆధ్యాత్మిక జీవన విధానాన్ని, సేవా మార్గాన్ని ప్రబోధించిన మాస్టర్ ఈకే ప్రతిరూపమే జగద్గురు పీఠమని జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్యుత రామారావు తెలిపారు. మాస్టర్ ఈకే 41వ వర్ధంతిని పురస్కరించుకొని తాటిచెట్లపాలెంలోని సంస్కృతి సదన్‌లో శుక్రవారం ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. జగద్గురు పీఠం, జనశిక్షణ సంస్థాన్ సంయుక్తంగా కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న వృత్తివిద్యలలో శిక్షణ పొందిన వందలాది మంది మహిళలు స్వయం ఉపాధి పొందారని చెప్పారు. పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ మాస్టర్ ఈకే రచించిన శతాధిక గ్రంథాలు నేడు సాధకులకు మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. సౌందర్య పోషణ, ఎంబ్రాయిడరీ కోర్సులలో ఉత్తీర్ణులైన 60 మంది మహిళలకు ధ్రువీకరణపత్రాలను ప్రదానం చేశారు. ఎనిమిది మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. మాస్టర్ హోమియో వైద్యాలయం నిర్వాహకురాలు డాక్టర్ అజ్జరపు సుబ్బలక్ష్మి, జగద్గురు పీఠం డైరెక్టర్ బి.ఉషారాణి, గొల్లపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు టవర్ లైట్స్

» హైవే జంక్షన్లలో ఏర్పాటుకు చర్యలు



ఊర్వశి జంక్షన్‌లో పనులు చేస్తున్న కార్మికులు, ఆర్అండ్‌బీ జంక్షన్‌లో స్తంభం ఏర్పాటుకు చర్యలు

మురళీనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసుల అభ్యర్థన మేరకు జీవీఎంసీ ఉత్తర నియోజకవర్గంలోని జోన్-5 పరిధి ముఖ్య జంక్షన్లలో ఎలక్ట్రిక్ టవర్ లైట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఊర్వశి, ఆర్అండ్‌బీ, బిర్లా జంక్షన్, తాటిచెట్ల పాలెంలో రూ.38 లక్షలతో పనులు ప్రారంభించారు. జీఈ పోల్స్ ఏర్పాటుకు ప్రస్తుతం హైవే సెంటర్ డివైడర్‌ల మధ్య పునాదులు తీసి కాంక్రీట్ పిల్లర్లు నిర్మిస్తున్నారు.

20 అడుగుల లైటింగ్ మెరుపులు

రాత్రి వేళల్లో ఈ ప్రదేశాల్లో చాలాసార్లు రోడ్డు క్రాస్ చేస్తూ ప్రాణాలు కోల్పోయిన ఘటనలు నమోదయ్యాయి. ఏడాది క్రితం స్విగ్గీ ఫుడ్ డెలివరీ బాయ్ జ్యోతినగర్ నుంచి బిర్లా జంక్షన్ దాటి మురళీనగర్ రోడ్డులో మెడికల్ షాప్‌కు వస్తుండగా భారీవాహనం ఢీకొని బిర్లా జంక్షన్‌లో చనిపోయారు. ఇలాంటి ఉదాహరణలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా తాటిచెట్ల పాలెం హైవే జంక్షన్ నాలుగురోడ్ల వద్ద వాహనాలు లేన్ క్రాసింగ్‌లో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే బిర్లా జంక్షన్‌లో తరచూ సిగ్నల్ లైట్లు పనిచేయక ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసుల వినతి మేరకు జీవీఎంసీ నగరంలోని నాలుగు చోట్ల 20 మీటర్ల లైటింగ్ స్తంభాలు అమరుస్తోంది. జీవీఎంసీ లైటింగ్ సెక్షన్ డీఈ బాబూరావు పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. కొత్త స్తంభాలపై లైట్ల అమరిక, కేబుల్స్, నిర్వహణను కాంట్రాక్టు ప్రాతిపదికన చేపడుతున్నారు. పోలీసు గస్తీకి, ప్రమాదాల నివారణకు ఈ అదనపు విద్యుత్ కాంతులు ఉపకరించనున్నాయి.

'మన్యం ధీరుడు' చిత్రం మరుపురాని జ్ఞాపకం: ఎమ్మెల్యే గంటా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మన్యం ధీరుడు చిత్రం మరుపురాని జ్ఞాపకమని, చరిత్ర తెలుసుకునేందుకు ఈ చిత్రం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం మన్యం ధీరుడు చిత్ర విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంటా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భీమిలి సమీపంలోని పాండ్రంగిలో జన్మించిన అల్లూరి సీతారామరాజు జీవితాన్ని చిత్రంగా నిర్మించడం హర్షణీయమన్నారు. త్వరలోనే ఫిల్మ్ క్లబ్ కమిటీని వేస్తున్నామన్నారు. చిత్ర నిర్మాత, హీరో ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి నిజమైన చరిత్రను నేటి యువతకు తెలియజేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ వీసీ జీఎస్ఎన్ రాజు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ఆదినారాయణ, సత్యనారాయణ, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో సిటిజన్ ఫోర్స్ పురస్కారాల వేడుక నేడు

మహారాణిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌టీపీసీ ఇండియా సిటిజెన్‌ఫోర్సు ఎక్సలెన్సీ అండ్ లారెట్ అవార్డులను శనివారం సాయంత్రం అందజేయనున్నట్లు సిటిజన్ ఫోర్సు వ్యవస్థాపక చైర్మన్ పి.రమేష్ బాబు, ఎఫ్‌టీపీసీ ఇండియా అధ్యక్షుడు జెంగా చైతన్య తెలిపారు. శుక్రవారం హోటల్ దసపల్లాలో విలేకరులతో మాట్లాడుతూ చిల్డ్రన్ ఎరీనాలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో మూన్‌మూన్ సేన్, సుమన్, భానుచందర్ పాల్గొంటారని తెలిపారు. నటి సైనా గంగూలీ, ప్రీతా ముజెందార్, బిగ్ బాస్ ఫ్రమ్ షానీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు


సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ నివాసితుల ఆనంద తాండవం



ఎండాడలోని వైశాఖి స్కైలైన్‌లో యువతుల ఆనందహేల

మాధవధార/సీతమ్మధార/ఎండాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ సంబరాల్ని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాధవధారలోని గ్రీన్ వ్యాలీ, కేఎస్సార్ వ్యాలీ అపార్ట్‌మెంట్ సమూహాల్లోనూ, విద్యాసంస్థల వద్ద అట్టహాసంగా వేడుకలు జరిగాయి. యువత రంగు నీళ్లు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. విద్యార్థులు కాలనీల్లో సందడి చేశారు. కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల నిర్వహణలోనూ వేడుకలు చేపట్టారు. సీతమ్మధార రైతుబజార్ వెనుక గల ల్యాన్సమ్ ఆక్సిజన్ టవర్స్‌లో వేడుకలు అంబరాన్ని తాకాయి. టవర్స్‌లో ఉన్న నివాసితులంతా ఒక సమూహంగా ఏర్పడి సంబరాలు జరుపుకొన్నారు. రంగులు జల్లుకొంటూ కలర్‌ఫుల్ రెయిన్ డ్యాన్స్‌తో, డీజే శబ్దాలతో హోరెత్తించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎండాడ వైశాఖి స్కైలైన్‌లో హోలీ సంబరాలు మిన్నంటాయి. స్కైలైన్ ఫ్లాట్‌ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాయి. ఫ్లాట్‌ఓనర్స్ అంతా ఒకే కుటుంబ సభ్యులుగా కలసి హోలీ రంగులతో ఉల్లాసంగా ఆడుకున్నారు. పరస్పరం రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు .సంబరాలు ఉదయం నుంచి సాయత్రం వరకు జరిగాయి.

'అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు'



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా అరెస్టులు చేసి ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. నరసింహనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు నిరసన ప్రదర్శనలకు ఇచ్చిన పిలుపును అడ్డుకోవడానికి స్టీల్ ప్లాంట్ గాజువాక పోలీసులు ముందస్తుగా గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, కార్మిక సంఘాల నాయకులను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ప్రజా ఉద్యమాలను ఆపాలనుకుంటే ప్రభుత్వానికి కార్మికవర్గం తగిన గుణపాఠం చెబుతుందన్నారు. కార్మిక సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీఆర్పీల నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సీఆర్పీలు

అక్కయ్యపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గ్రేటర్ 26వ వార్డు ఎస్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షునిగా తాటిపూడి త్రినాథ్ (భీమిలి), ఉపాధ్యక్షునిగా వి.సన్నిబాబు (పెందుర్తి), ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి (సీతమ్మధార), జనరల్ సెక్రటరీగా గౌరీశంకర్ (ఆనందపురం), మహిళా సెక్రటరీగా రమా వెంకటలక్ష్మి (పెదగంట్యాడ), కోశాధికారిగా జట్లయ్య (పద్మనాభం), మీడియా అడ్వయిజర్‌గా కృష్ణారావు (ములగాడ) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఎల్.చైతన్య, ఆర్.రాధాకుమారి, శోభారాణి, పి.నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. అనంతరం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు బి.గౌరమ్మ, శివాజీ, ఈశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక కుటుంబ సభ్యులకు అప్పగింత

సీతంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రాంతానికి చెందిన ఓ బాలిక ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ద్వారకా పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలిక ఆచూకీని రాత్రి సమయానికే కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ, పోలీసు సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.2.5 లక్షల పరిహారం

మహారాణిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు శుక్రవారం రూ.2.5 లక్షల పరిహారం అందజేశారు. నగర పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం ద్వారా ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో మృతి చెందిన వి.సంతోషి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు అందజేశారు. తీవ్ర గాయాల పాలైన ఎ.వెంకట శశాంక్‌కు రూ.50 వేలు ఇచ్చారు.

నూకాంబిక అమ్మవారికి వైభవంగా జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం


నీళ్ల బిందెలతో ఆలయం వద్ద భక్తులు

మురళీనగర్/కంచపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ నిర్వహణలో ఇక్కడి ఆలయంలో చేపట్టిన వార్షిక మహోత్సవాల్లో అమ్మవారికి భక్తులు పసుపు బిందెలతో నీళ్లు తెచ్చి, గంటల తరబడి నిరీక్షించి అమ్మవారికి స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఉదయం 5 గంటల నుంచే ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు బుచ్చిబాబు శర్మ, పండిత బృందం, సహాయకులు వేడుకల్లో భక్తులకు తోడ్పాటునందించారు. దశాబ్దాలుగా వస్తున్న ఆచారం ప్రకారం ఆలయంలో ఈ వేడుకల్ని ఘనంగా చేపట్టారు. మాధవధార, ఎస్‌జీజీఓస్ కాలనీ, కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, 104 ఏరియా, తాటిచెట్ల పాలెం ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి జలాభిషేకం తర్వాత ప్రత్యేకంగా కొలువైన అమ్మవారిని దర్శించుకున్నారు. జైభారత్ నగర్‌లో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారికి ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు భక్తులే స్వయంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు వెల్లంకి భరత్, గండి శ్రీవంశీ, గొర్లె అప్పారావు, ఈతలపాక సుజాత, ఆలయ ఈవో రాజగోపాలరెడ్డి, అర్చకులు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

వసుంధర జ్యూవెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం


వసుంధర డైమండ్ రూఫ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నగర పోలీసు కమిషనర్ అర్ధాంగి సువ్రశ్రీ బాగ్చి

సాగర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అందమైన జ్యూవెలరీ తయారీ వెనుక, వాటిని తీర్చిదిద్దేవారి నైపుణ్యం, ప్రతిభ, కష్టం దాగి ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అర్ధాంగి సువ్రశ్రీ బాగ్చి అన్నారు. వసుంధర డైమండ్ రూఫ్ ప్రారంభమై 28 సంవత్సరాలు, విజయవాడ శాఖ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నగరంలోని ర్యాడిసన్ బ్లూ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన జ్యువలరీ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. మహిళలు మెచ్చే వివిధ డిజైన్లతో కూడిన ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. అన్ని రకాల ఆభరణాలను ఒకే చోట అందుబాటులో ఉంచిన వసుంధర డైమండ్ రూఫ్ నిర్వాహకులను సువ్రశ్రీ బాగ్చి అభినందించారు. వసుంధర డైమండ్ రూఫ్ విశాఖపట్నం నిర్వాహకులు తొట్టంపూడి శ్రీదేవి మాట్లాడుతూ శనివారం కూడా కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో సరికొత్త వెరైటీ బంగారు, డైమండ్ జ్యూవెలరీ ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని తెలిపారు. ప్రతీ రూ.2 లక్షల కొనుగోలుపై లక్కీడ్రా కూపన్ ఇస్తామన్నారు. విజేతలకు డైమండ్ ఫింగర్ రింగ్ బహుమతిగా ఇస్తామని శ్రీదేవి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గోల్‌మాల్!

... 5వ పేజీ తరువాయి

నిర్ణయంతో ఏడీపీ తగ్గింపు కోసం 29.10.2013న సప్లిమెంటరీ అగ్రిమెంట్ తయారుచేశారు. ఎపిట్కో లెక్కల ప్రకారం మొదటి ఏడాది 2009-10లో రూ.14 లక్షలు, అలా క్రమంగా ఏటా పెరుగుతూ చివరి సంవత్సరం 2038-39కి రూ.57.63 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ 30 ఏళ్ల ఏడీపీ ఆదాయం రూ.9.3 కోట్లు. ఎండీ చేసిన సప్లిమెంట్ అగ్రిమెంట్‌లో 2012-13 నుంచి ఏడీపీ వసూలు చేయాలని నిర్ణయించి ఆ విధంగానే ముందుకువెళ్లారు. ఆ ఏడాది రూ.10 లక్షలతో ప్రారంభించారు. చివరి ఏడాదికి వచ్చేసరికి ఆ మొత్తం కేవలం రూ.25.41 లక్షలకే పరిమితమైంది. ఆ కొత్త లెక్కల ప్రకారం సుహానీ మాల్ చెల్లించాల్సిన ఏడీపీ రూ.5.02 కోట్లకు పడిపోయింది. దీనివల్ల విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌కు రూ.4.27 కోట్లు నష్టం వచ్చింది. ఈ లెక్కలన్నీ చూపిస్తూ పలువురు ప్రభుత్వానికి వారం క్రితం ఫిర్యాదు చేశారు. గతంలో ఎండీగా పనిచేసినప్పుడు పలు తప్పులు చేశారని, ఇప్పుడు అదే పోస్టులో ఉంటూ వాటిని సరిదిద్దుకునేందుకు రికార్డులు మార్చాలని అకౌంటెంట్‌పై ఒత్తిడి పెడుతున్నారని, దాంతో అతను ఆత్మహత్యాయత్నం కూడా చేశారని, విచారణ చేయాలని వారు కోరారు. సంస్థ భూమిని బ్యాంకులో తనఖా పెట్టుకోవడానికి ఉద్దేశపూర్వకంగా సహకార శాఖాధికారులు అనుమతి ఇచ్చారనే అంశంపై విచారణ జరుగుతున్నందున ఎండీని ఆ స్థానం నుంచి తప్పించి, విచారణ పారదర్శకంగా జరిగేలా చూడాలని ఫిర్యాదులో కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికైనా సూపర్ బజార్‌లో ఏమి జరుగుతున్నదో పూర్తిగా దృష్టి పెట్టాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది.

ఉబర్ బాదుడు

... 5వ పేజీ తరువాయి

డ్రైవర్లను ప్రశ్నిస్తే..అది రిపేర్‌లో ఉందని, అందుకే వేరే దాంట్లో వచ్చామని చెబుతున్నారు. మరికొందరైతే... సంస్థ ఓటీపీని ఎంటర్ చేశాక ఓకే చేసిందంటే..రైడర్‌గా తమను ఆమోదించినట్టేనని, ఏ వాహనమైనా ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. అయితే అనుకోని ప్రమాదాలు, ఇతర ఘటనలు ఏమైనా జరిగితే...యాప్‌లో చూపించే వాహనం నంబరు, ఘటన జరిగిన వాహనం నంబరు వేరుగా ఉంటాయి. ఇది వినియోగదారుల భద్రతకు సంబంధించిన విషయం.

ఐఫోన్లు, శ్యామ్‌సంగ్ ఫోన్లకు అధిక ఛార్జీలు

మద్దిపాలెం డిపో ప్రాంతం నుంచి ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి వన్ ప్లస్ ఫోన్‌లో కారు బుక్ చేస్తే కేవలం రూ.124కే వస్తోంది. అదే శ్యామ్‌సంగ్ ఖరీదైన ఫోన్‌లో బుక్ చేస్తే రూ.156 చూపిస్తోంది. ఐఫోన్ల నుంచి చేసే బుకింగ్స్‌కు కూడా ఇదే విధంగా ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

నగదు ఇవ్వాలని డిమాండ్

ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పే వాడకం పెరగడంతో టీలు, టిఫిన్లు, రైతుబజార్లలో కూడా ఇలాగే చెల్లింపులు జరుగుతున్నాయి. కానీ 'ఉబర్ మాత్రం ప్రత్యేకంగా ఆటోలకు నగదు చెల్లించాలంటూ గత రెండు వారాలుగా ప్రత్యేక మెసేజ్‌లు పెడుతోంది. ఇక్కడ చిల్లర సమస్యలు వస్తున్నాయి. యాప్ ద్వారా చెల్లిస్తే సంస్థ నుంచి డ్రైవర్లకు సకాలంలో డబ్బులు రావడం లేదని, కమీషన్లపై వివాదాలు కూడా తలెత్తుతున్నాయని పలువురు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

... 5వ పేజీ తరువాయి

విడుదల చేయాలని ఆదేశాలు వెళ్లాయి.

వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్ల కిందట జిల్లాలోని 319 పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు (ప్రస్తుతం మన బడి-మన భవిష్యత్తుగా పేరు మార్చారు) కింద రూ.115.67 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. అయితే తొలి నుంచి నిధుల సమస్య వెంటాడింది. అనుకున్న సమయంలో పనులు పూర్తికాలేదు. కొన్నిచోట్ల మధ్యలో నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి భవనాలు వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.27 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. పెయింటింగ్ బకాయిలు ఆరు కోట్ల రూపాయలు వరకూ ఉన్నాయి. అదనపు తరగతి గదులు అందుబాటులోకి తీసుకురావడం కోసం తొలుత రూ.పది కోట్లు అవసరమని చెబుతున్నారు. తాజాగా విడుదల చేసిన రూ.1.2 కోట్లు ఏ మూలకు సరిపడవని పాఠశాలల అభివృద్ధి కమిటీలు వ్యాఖ్యానిస్తున్నాయి. కనీసం రూ.10 కోట్లు ఇస్తే వచ్చే జూన్‌కల్లా మధ్యలో నిలిచిన అదనపు గదులు అందుబాటులోకి వస్తాయని అంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు...మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి నిధులు విడుదల చేయించాలని పాఠశాలల అభివృద్ధి కమిటీలు కోరుతున్నాయి.

పక్కాగా భూముల రీసర్వే

... 5వ పేజీ తరువాయి

పోస్టు చేస్తారు. ఇప్పటికే సర్వేయర్లు ప్రతి బ్లాకులో రైతుల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించే పనిలో ఉన్నారు. ఈ ఎనిమిది గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తిచేసిన సర్వే శాఖ రీసర్వేకు అంతా సిద్ధం చేసింది. గొట్టిపల్లి, గంధవరం, దాకమర్రి గ్రామాల్లో కొన్ని వారాలుగా రీసర్వే జరుగుతోంది. జిల్లాలోని 85 రెవెన్యూ గ్రామాలకుగాను 59 గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో రీసర్వే పూర్తిచేశారు. మిగిలిన గ్రామాల్లో రీసర్వే పనులు పక్కాగా నిర్వహించాలని జేసీ కె.మయూర్ అశోక్ ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా తప్పులు దొర్లకుండా సర్వేయర్లు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు.

భూ మాయగాళ్లకు జైలు

... 5వ పేజీ తరువాయి

అప్పట్లో పోలీసులకు అంజిలరావు, తదితరులపై అప్పారావు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి సీఐ జె.మురళీ కేసు నమోదు చేయగా, ఏసీపీ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసి చార్జిషీటు వేశారు. వెస్ట్ ఏసీపీ పృథ్వీరాజ్ పర్యవేక్షణలో సీఐ కేవీ సతీశ్‌కుమార్ సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టడం, కోర్టులో ఆధారాలను సమర్పించడంతో విక్రయించిన స్థలాన్ని ఆక్రమించుకుని తప్పుడు పత్రాలతో వేరొకరికి విక్రయించిన అంజిలరావు, మరిడయ్య, రమణ, గోవింద్, రాంబాబు, చిన మరిడయ్య, సూరిబాబులకు ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష విధించడంతో పాటు, వారి చేతిలో మోసపోయిన పిలమాల అప్పారావుకు ఒక్కొక్కరు రూ.2.9 లక్షల చొప్పున రూ.18.6 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించాలని కోర్టు తీర్పు వెలువరించినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులతో కలిసి వీసీ భోజనం

... 5వ పేజీ తరువాయి

వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రస్తుతం గెస్ట్ హౌస్‌లో ఉంటున్న ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు హాస్టల్ నుంచే భోజనం వెళుతోంది. విద్యార్థులకు వడ్డించే ఆహారాన్నే తనకు పంపించాలని ఆదేశాలు ఇచ్చిన ఆయన...సరిగా లేకపోతే మార్పులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును ఆయా హాస్టళ్లకు ఆయన చెల్లించనున్నారు. గడిచిన కొద్దిరోజుల నుంచి ఆయన ఒక్కో హాస్టల్ నుంచి భోజనం తెప్పించుకుంటున్నారు. ఇప్పటివరకూ ఇంజనీరింగ్, రీసెర్చ్ స్కాలర్స్, ఆర్ట్స్ కాలేజీలకు చెందిన హాస్టళ్ల నుంచి వచ్చిన భోజనాన్ని రుచిచేశారు. అయితే భోజనం బాగాలేదంటూ కొద్దిరోజుల కిందట విద్యార్థులు ఆందోళన చేయడంతో ఎప్పటికప్పుడు హాస్టళ్లను తనిఖీ చేసేందుకు ఆయన నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఆయన గడిచిన రెండు రోజులుగా వివిధ హాస్టళ్లకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నారు. ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నారు. ఇబ్బందులు ఉన్నచోట విద్యార్థులతో మెస్ కమిటీలు వేయడంతోపాటు భోజనం ఎలా ఉందన్న సమాచారాన్ని తెప్పించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, ఆయా హాస్టల్ వార్డెన్లతో ఎప్పటికప్పుడు సమావేశాలు పెట్టాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో హాస్టళ్ల నిర్వహణను గాడిలో పెట్టాలని యోచిస్తున్నారు.

నష్టంపై పోరాడే హక్కు

వస్తువు/సేవ కొనుగోలులో ఎదురయ్యే ఇబ్బందులపై ఫిర్యాదులకు అవకాశం



» అండగా నిలిచేలా వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం
» ప్రజలకు అవగాహన తప్పనిసరి
» నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

విశాఖపట్నం/ సింహాచలం, (ఆంధ్రజ్యోతి) : **ఏదైనా ఒక వస్తువు/సేవ పొందినప్పుడు ఇబ్బంది ఎదురైతే కొనుగోలు చేసిన సంస్థ నుంచి సకాలంలో పరిష్కారాన్ని పొందేందుకు వినియోగదారులకు హక్కు ఉంది. వినియోగదారుల హక్కులపై చాలామందికి అవగాహన లేకపోవడంతో ఆయా సంస్థలు పట్టించుకోవు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా మార్చి 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2019 ప్రతి వినియోగదారుడికి అనేక హక్కులను కల్పిస్తోంది. ఈ ఏడాది స్థిరమైన జీవనశైలికి సరైన మార్పు థీమ్‌తో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

వినియోగదారుల హక్కుల ఉద్యమం అమెరికాలో 1920లో ప్రారంభమైంది. అదే ఏడాది వినియోగదారుల సంఘం ఏర్పాటయింది. ఆ తరువాత అనేక దేశాలకు విస్తరించింది. రాల్ఫ్ నాడార్‌ని వినియోగదారుల ఉద్యమ పితామహుడిగా పేర్కొంటారు. ఆయన కృషి ఫలితంగా అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వినియోగదారుల హక్కులకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1986లోవినియోగదారుల చట్టాన్ని రూపొందించింది. 1989లో మార్చి 15న వినియోగదారుల దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించింది.

ఇవీ హక్కులు..

వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2019 ప్రకారం కొనుగోలు చేసే వస్తువు/సేవపై ప్రతి వినియోగదారుడు హక్కు కలిగి ఉంటాడు. సదరు వస్తువు నిర్దేశిత కాలం వరకు పనిచేయకపోయినా, ఫిర్యాదులను పరిష్కరించడంలో సంస్థలు నిర్లక్ష్యం ప్రదర్శించినా హక్కులకు భంగం కలిగినట్టే. రుణాల మంజూరులో ఇబ్బందులు, వస్తువు కొనుగోలు, సర్వీస్‌లో సమస్యలు, ఆహార విక్రేత సంస్థల్లో నిర్లక్ష్యం వంటివన్నీ వినియోగదారుల హక్కుల భంగం కిందకు వస్తాయి. వీటిపై పోరాడి నష్టపరిహారాన్నిపొందడంతోపాటు ఆయా సంస్థలపై చర్యలు తీసుకునేలా చట్టం ఉంది. ఐఎస్ఐ మార్కు ఉన్న ఏ ఉత్పత్తి అయినా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌కు ఫిర్యాదు చేసే హక్కు వినియోగదారులకు ఉంది. ఆహార పదార్థాలు ఇతర ఉత్పత్తులైనా ఫిర్యాదుకు అవకాశముంది. బంగారం వస్తువులైనా, బిస్కెట్‌లైనా హాల్‌మార్క్ లేకపోతే ఫిర్యాదు చేయవచ్చు.

ఫోరంలో కేసు వేయొచ్చు..

వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లితే బాధిత వ్యక్తులు జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేయవచ్చు. విక్రేత/వ్యాపారి మోసం చేసినట్టు ఆధారాలు ఉండాలి. వస్తు, సేవకు బిల్లు, గ్యారంటీ, వారంటీలుండాలి. ఎవరిపైన ఫిర్యాదు చేస్తున్నామో వారికి విషయాన్ని తెలియజేయాలి. అప్పటికీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే కేసు వేయవచ్చు. ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో న్యాయం జరిగేలా చూస్తారు.

చట్ట పరిధిలో సంస్థలు

వినియోగదారుల హక్కుల చట్టం పరిధిలో బ్యాంకులు, ప్రైవేట్ కంపెనీలు, కొన్ని ప్రభుత్వ సంస్థలు, జీవిత బీమా, విత్తనాల కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీలు వంటివి ఉన్నాయి. నగదు చెల్లించి వస్తువులు, సేవలను ఉపయోగించుకునే ప్రతి ఒక్కరూ వినియోగదారుడు కిందకు వస్తారు.

వినియోగదారుల ఫోరం పరిధి

జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మూడు వినియోగదారుల ఫోరాలున్నాయి. నష్టపరిహారం కోసం జిల్లా ఫోరంలో రూ.20 లక్షల వరకు, రాష్ట్ర కమిషన్ రెండు కోట్లు వరకు, జాతీయ కమిషన్‌లో రెండు కోట్లు దాటిన కేసులను నమోదు చేయవచ్చు. రూ.5 లక్షల లోపు విలువజేసే కేసులకు రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. దాటితే కొంతమొత్తం చలనా తీయాలి.

భారీగా నష్ట పరిహారాలు..

జిల్లాలో ఈ ఏడాది 81 కేసులు నమోదయ్యాయి. రిలయన్స్ సంస్థలో రూ.1.77 లక్షలు విలువజేసే ల్యాప్‌టాప్ కొనుగోలు చేసిన వ్యక్తి ఇబ్బంది ఉందని ఫిర్యాదు చేస్తే సంస్థ స్పందించలేదు. దీంతో కేసు వేయగా ఫోరం ఆరు శాతం వడ్డీతో సహా రూ.2.14 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. మరో కేసులో ఒక వ్యక్తి రూ.1.36 లక్షలు పెట్టి స్కూటీ కొనుగోలు చేశాడు. సర్వీస్ చేయించేందుకు సంస్థను ఆశ్రయించగా కొన్ని నెలలపాటు స్కూటీని వారి వద్దే ఉంచుకున్నారు. దీనిపై నష్టపరిహారం, కాలం, స్కూటీ కొనుగోలు చేసిన మొత్తం కలిపి రూ.2.9 లక్షలు చెల్లించాలని ఫోరం ఆదేశించింది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. చాలా మందికి అవగాహన లేక నష్టపోయినా మిన్నకుంటున్నారు. నష్టాన్ని భర్తీ చేసుకునే అవకాశం ప్రతి వినియోగదారుడికీ ఉంది. అవగాహన ఉంటేనే పోరాటం చేసేందుకు వీలుంటుంది. దేశ వ్యాప్తంగా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏటా వందలాది మంది వినియోగదారుల పక్షాన పోరాడుతున్నాం.

- డాక్టర్ వికాస్ పాండే, వినియోగదారుల హక్కుల కౌన్సిల్ జాతీయ ప్రెసిడెంట్

బస్టాప్‌లలో ఆటోల అక్రమ పార్కింగ్

» మద్దిలపాలెంలో తీవ్ర ట్రాఫిక్ కష్టాలు » పట్టించుకోని పోలీసులు, ఆర్టీసీ అధికారులు

మద్దిలపాలెం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం ఆర్టీసీ బస్టాప్‌లు ఆటోలు, కార్లు అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయాయి. రోడ్డు మధ్యలో దర్జాగా ఆటోలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. రహదారి భద్రత మాసోత్సవాల్లో ఆర్టీసీ డ్రైవర్లు ఈ సమస్య గురించి పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. మద్దిలపాలెం సిటీ డిపో ఎదురుగా ఉన్న బస్టాప్‌లలో అక్రమ పార్కింగ్‌లకు పాల్పడుతున్నా ఆర్టీసీ అధికారులు స్పందించక పోవడం గమనార్హం. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, తగరపువలస, సింహాచలం, ఆరిలోవ ప్రాంతాల నుంచి వచ్చే సిటీ బస్సులు మద్దిలపాలెం బస్టాప్ మీదుగా జగదాంబ, ఎన్ఏడీ వైపు ప్రయాణిస్తాయి. దీంతో రోజుకు వందలాది బస్సులు మద్దిలపాలెం బస్టాప్‌వద్ద ఆగుతాయి. ఆయా బస్సుల కోసం ప్రయాణికులు సైతం బస్టాప్‌లతో వేచిచూస్తుంటారు. అయితే ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆటో డ్రైవర్లు బస్టాప్ ఎదురుగా ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులను అందుకోవాలనే గాబరాలతో పరుగులు తీసే ప్రయాణికులు కింద పడి గాయాల పాలవుతున్నారు. కొన్నిసార్లు ఇది ప్రమాదకర స్థితిలో ఉంటోంది.

గతంలో బస్టాప్‌లలో ఆటోలు నిలపకుండా ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వహించేవారు. కొద్ది నెలల నుంచి ఆర్టీసీ సిబ్బంది లేకపోవడంతో ఆటోలు జాతీయ రహదారి మధ్యలోనే ఆటోలు నిలుపుతున్నారు. దీనివల్ల వాహన రాకపోకలకు అంతరాయం కలిగి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.



మద్దిలపాలెం బస్టాప్‌లో వరుసగా నిలిపిన ఆటోలు

అలాగే. మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ బయట నో పార్కింగ్ ప్రాంతంలో ఆటోలు, ట్రావెల్స్ కార్లు పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చే బస్సులు ఆటోల పార్కింగ్‌తో ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటోంది. అక్కడకు కాస్త దూరంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ విడిచిపెట్టినప్పుడు ఈ ట్రాఫిక్ మరింత ఎక్కువై ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీఆర్పీల నూతన కార్యవర్గం

అక్కయ్యపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్జీవోఎస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా తాటిపూడి త్రినాథ్ (భీమిలి), ఉపా. ధ్యక్షునిగా వి.సన్నిబాబు (పెందుర్తి), ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి (సీతమ్మధార), జనరల్ సెక్రటరీగా గౌరీశంకర్ (ఆనందపురం), మహిళా సెక్రటరీగా రమా వెంకటలక్ష్మి (పెదగంట్యాడ), కోశాధికారిగా జట్లయ్య (పద్మనాభం), మీడియా అడ్వైజర్‌గా కృష్ణారావు (ములగాడ) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఎల్.చైతన్య, ఆర్. రాధాకుమారి, శోభారాణి, పి.నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. అనంతరం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు బి.గౌరమ్మ, శివాజీ, ఈశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్** : సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా** : జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం** : సంగం, శారద, కిన్నెర,
- **మజాకా** : రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్** : జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్** : మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 46, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

ఉత్సాహంగా హోలీ

రంగులు పూసుకొని సందడి చేసిన యువత



రంగులు వేసుకొని సంబరాలు జరుపుకుంటున్న చిన్నారులు

వెంకోజీపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : "హోలీ హోలిహోలీ.. రంగుల రంగోలి.. ఊరంతా ఆడాలి రంగులతో.." అంటూ యువకులు చిందులేశారు. ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుంటూ రోడ్లపై పరుగులు తీశారు. ఇంకొందరు కోడి గుడ్లను తలపై కొట్టుకుని సందడి చేశారు. శుక్రవారం ఉదయం నుంచి అందరూ ఆనందోత్సాహాలతో హోలీ పండగ నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రంగులను వేసుకుంటూ సరదాగా గడిపారు. దీంతో రోడ్లన్నీ రంగులమయమయ్యాయి. యువకులు కేరింతలు కొడుతూ రంగులు పూసుకొని ద్విచక్రవాహనాలపై ఊరంతా చక్కెర్లు కొట్టారు. యవతులు, మహిళలు సైతం రంగులను చల్లుకుంటూ సరగాగా గడిపారు. కేవలం రోడ్లపైనే కాకుండా వీధుల్లో కూడా హోలి పండుగ సందడి కనిపించింది.

ఆరిలోవలో..

ఆరిలోవ :ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం ఉదయం చిన్నారులు, యువత హోలీ ఆటలు ఆడారు. ఒకరిపై ఒకరు రంగులు వేసుకొని, రంగులను ఒంటికి పూసుకొని ఆనందంతో హోళీ క్రీడలో మునిగితేలారు. కుల మతాలకు అతీతంగా అంతా హోలీ ఆటలు ఆడారు. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, ఆదర్శనగర్, ఇందిరానగర్, పైనాపిల్ కాలనీల్లో సందడి ఎక్కువగా కనిపించింది.

సాగర తీరం.. ఆనందవర్ణం

బీచ్‌రోడ్డులో ఆనందోత్సాహాలతో హోలీ

బీచ్ రోడ్డు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : హోలీ పంగడ వేళ సాగర తీరం రంగులతో కళకళలాడింది. యువత సందడితో హోరెత్తింది. యువతీయువకులు ఒకరికొకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టమోటాలు, కోడిగుడ్లతో కొట్టుకొంటూ సరదాగా గడిపారు. రంగులు పులుముకొని ఉత్సాహంగా పరుగులు తీశారు. శరీరానికి రంగులు పోవడానికి సముద్రంలో మునిగారు. కుర్రకారు బైకులెక్కి తీరంలో దూసుకుపోయారు. యువత హుషారుగా నృత్యాలు చేశారు. పలువురు కుటుంబ సమేతంగా బీచ్‌కు చేరుకొని ఆటపాటలు, కేరింతలతో ఆనందంగా గడిపారు.

హోరెత్తిన బీచ్ రోడ్డు

వేకువ జాము నుంచే యువతీ యువకులు వైట్ కలర్ దుస్తులతో హోలీ ఆడేందుకు బీచ్‌రోడ్డులోని పలు హోటళ్లలో ఏర్పాటు చేసిన ఈవెంట్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చాలా వరకు సహజ సిద్ధ రంగులు వాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఉదయాన్నే చిన్న పిల్లలు సైతం ఉత్సాహంగా రంగులు పూసుకొని ఆనందంగా గడిపారు. యువత గుంపులుగా చేరి బైక్‌లతో రోడ్డు మీద సందడి చేశారు. ప్రముఖ హోటళ్లలో హోలీ సంబరాల కోసం ముందుగానే నిర్వాహకులు ఏర్పాటు చేయడంతో యువకులు ఉత్సాహంగా హోలీ జరుపుకునేందుకు పెద్దఎత్తున టికెట్లు బుక్ చేసుకొన్నారు. పోలీసులు ముందస్తు చర్యలుగా బీచ్ రోడ్డులో పహారా కాశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



తీరంలో ఆనందంతో నృత్యాలు చేస్తున్న యువతీయువకులు

రెయిన్ డ్యాన్సులు

బీచ్ రోడ్డులో భారీ ఎత్తున టెంట్లు ఏర్పాటు చేసి రంగోళి సెలబ్రేషన్స్‌లో పెద్ద ఎత్తున యువతీ యువకులు పాల్గొని ఒకరికొకరు రంగులు పూసుకొని రెయిన్ డ్యాన్స్ వేస్తూ ఎంజాయ్ చేశారు. డీజేల భారీ సౌండ్‌తతో బీచ్ పరిసరాలు హోరెత్తిపోయాయి. హిందువులు వీధులన్నీ తిరుగుతూ రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు. ఇక్కడున్న ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆద్యంతంగా సందడిగా గడిపారు.

సంప్రదాయబద్ధంగా అప్పన్న డోలోత్సవం



స్వామివారికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



చూర్ణోత్సవం సందర్భంగా భక్తులపై రంగులు చల్లుతున్న అర్చకుడు

» ఆనందోత్సాహాల నడుమ చూర్ణోత్సవం

సింహాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా నిర్వహించే డోలోత్సవం శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న సహోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె శ్రీమహాలక్ష్మితో వివాహం నిశ్చియమైంది. చైత్ర మాస శుక్లపక్ష ఏకాదశి ఏప్రిల్ 8న సింహాద్రినాథుని వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. చైత్ర మాస పాడ్యమి ఈనెల 30న ఉగాది రోజున పందిరిరాట వేస్తారు. ఉదయం కొండదిగువన అప్పన్న పెళ్లిచూపులు జరిగాయి. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పెళ్లికుమారిడిగా తీర్చిదిద్దారు. బేడా మండపంలో తిరువీధి అనంతరంచూర్ణాలతో ప్రదక్షిణలు చేశారు. మూలవిరాట్ వద్ద యోగానంద నారసింహునికి, బేడా మండపంలోని సింహవల్లీ తాయార్, ఆండాళ్ అమ్మవారు, లక్ష్మీనారాయణులు, ఆళ్వారుల సన్నిధిలో చూర్ణాలతో పూజలు చేశారు. తరువాత స్వామివారిని మెట్ల మార్గంలో బోయిలు మోసుకొచ్చారు. కొండదిగువ తొలిపావంచా వద్ద అధికారులు, భక్తులు ఆహ్వానం పలికారు. అక్కడి నుంచి పైడితల్లి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. తనతో వివాహానికి ఆమె కుమార్తెను కోరగా అందుకు తొలుత తిరస్కరించి, ఎట్టకేలకు సమ్మతించడంతో అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి, ఉద్యాన మండపంలో బంధుమిత్రులతో స్వామి ఆనందాన్ని పంచుకున్న ఘట్టాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని డోలిక(ఊయల)లో ఉంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము జరిపి పూజలు చేశారు. నాలుగు రకాల చూర్ణాలను మిళితం చేసి తొలుత స్వామివారిపై చల్లారు. పెళ్లి ప్రకటనగా పంచదార శీతలం (పానకాన్ని) నైవేద్యంగా సమర్పించి భక్తులకు తీర్థంగా పంపిణీ చేశారు. అనంతరం మాడవీధుల్లో పల్లకిలో తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పీవీ నరసింహం, ఈవో కె.సుబ్బారావు దంపతులు, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు రమణాచార్యులు, హవాల్దార్ గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అలంకారి కరి సీతారామాచార్యులు, వేదపండితులు కపిలవాయ్ అగ్నిరామకుమార్, రామయణం జగన్మోహనశర్మ, గోదావరి సురేశ్, ఘనాపాఠి సుబ్రహ్మణ్యశర్మ, ఈఈ రాంబాబు, ఏఈఓ ఆనందకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా యల్లమాంబ మారువారం పండుగ



ఆలయం వద్ద బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

వెంకోజీపాలెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం యల్లమాంబ నగర్‌లో ఉన్న యల్లమాంబ అమ్మవారి మారువారం పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల వాసులు అమ్మవారిని దర్శించుకొని పసుపుకుంకుమలను అందజేశారు. సాయంత్రం బుర్రకథ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతమంతా సందడి నెలకొంది. కార్యక్రమంలో యల్లమాంబ నగర్ అధ్యక్షులు వారణాసి విశాలాక్షి, కార్యదర్శి కాళ్ల కుమార్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కాళ్ల అప్పలరాజు ఇతర గ్రామస్థులు, శ్రీసీతారామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు గుండెపోటుతో ట్రాక్టర్‌పైనే మృతిచెందాడు. మాడుగుల ఘాట్‌రోడ్డు ప్రాంతానికి చెందిన వి.సూర్యవెంకటరమణ (47) సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్ నడుపుతుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సమీపంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటరమణను అంబులెన్స్‌లో ప్లాంట్‌నుంచి తీసుకువెళ్తున్న క్రమంలో గేటు వద్ద మృతుని కుటుంబీకులు అడ్డుకొని మృతదేహాన్ని దింపి న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చలు జరపగా రూ.2 లక్షల నష్టపరిహారంతో పాటు దహన ఖర్చుల కింద మరో రూ.33వేలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.



ట్రాక్టర్‌పైనే మృతిచెందిన సూర్య వెంకటరమణ

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని హెచ్‌బీకాలనీ కనకదుర్గ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో ఆలయ అర్చకులు అభిషేకాలు జరిపి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అసోసియేషన్ అధ్యక్షులు దీవి సుందర రావు, ఉపాధ్యక్షులు మువ్వల వెంకట రాజశేఖర్, సిరిశెట్టి వి.ఏ.నారాయణరావు, సిరిపల్లి కృష్ణ, మళ్ల దుర్గాబాయి, సూర్యనారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : హోలీ పురస్కరించుకొని చినగదిలిలిలోని లలితాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం లక్ష సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు ఈ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. అనంతరం అందరికీ అమ్మవారి ప్రసాదాలను ఆలయ ప్రతినిధులు అందజేశారు.



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక బస్సులు నడపనున్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలకు బస్సులు నడపాలని ఆర్ఎం బి.అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. పరీక్ష ప్రారంభానికి రెండు గంటల ముందు, పరీక్ష ముగిసిన రెండు గంటల తరువాత వరకు ఈ బస్సులు నడుపుతారు. విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. నగర పరిధిలో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ విద్యార్థులను అనుమతించనున్నారు.

తీరంలో హోలీ సంబరం



ఆర్‌కే బీచ్‌లో రంగులు చల్లుకుంటూ...



రంగుల హరివిల్లు

తీరం రంగులతో కొత్త కళ సంతరించుకుంది హోలీ సందర్భంగా ఆర్‌కే బీచ్‌కు చేరుకున్న నగరవాసులు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సముద్రంలో స్నానాలు చేశారు. వేకువ జాము నుంచే యువత తెల్లని దుస్తులు ధరించి హోలీ ఆడేందుకు బీచ్‌రోడ్డుకు చేరారు. సహజ సిద్ధ రంగులు వాడుతూ సంబరాలు జరుపుకున్నారు. పలు హోటళ్లలో హోలీ సంబరాలు జరిగాయి. బీచ్ రోడ్డులో టెంట్లు ఏర్పాటు చేసి రంగోళి సెలబ్రేషన్స్ చేశారు. ఆలయాల్లో పూజలు జరిపారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి







యువత కేరింతలు



చిన్నారి సందడి



స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

» కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు

సిరిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి గురజాడ విగ్రహం వరకు ప్రదర్శన, మానవహారం నిర్వహించారు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, యూనియన్ నాయకులపై అక్రమ షోకాజ్ నోటీసులు రద్దు చేయాలన్నారు. స్టీల్ ప్లాంటు రక్షణ కోసం కార్మికులు గాజువాకలో తలపెట్టిన నిరసనను ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవడాన్ని, నేతలపై నిర్బంధ కాండను వ్యతిరేకించిన కూటమి నేతలు అధికారం చేపట్టాక అవే చర్యలకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలకు తక్షణమే స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ఉక్కు అభివృద్ధి కోసం రూ.11,400 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించామని, ప్లాంటును లాభాల బాట పట్టించడమే ధ్యేయమని కేంద్రం, కూటమి నేతలు ప్రకటించారని ప్యాకేజీతోనే ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించినట్టు నమ్మించారని విమర్శించారు. కార్మికుల తొలగింపునకు నోటీసులను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.రమణ, నాగభూషణం, కనకారావు, పద్మ, బేగం, నాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కదిలిన లారీని ఆపే ప్రయత్నంలో డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవరు

మహారాణిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీ ముందుకు కదలడంతో దాన్ని ఆపే ప్రయత్నంలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం మహారాణిపేటలోని అంకోసా వద్ద గల డాక్టర్స్ కాలనీ నూతన నిర్మాణాల వద్ద చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన గోపాల్ టుడు (45) అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు చెందిన లారీ డ్రైవరుగా పని చేసేవాడు. ఉదయం ఆటోనగర్ నుంచి డాక్టర్స్ కాలనీలో జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని తీసుకువచ్చి దించాడు. అనంతరం లారీని ఓ చోట ఆపాడు. లారీ పైకెక్కి శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా ముందుకు కదిలింది. వెంటనే కిందకు దిగి లారీ లోపల చేతితో బ్రేక్ నొక్కి లారీని ఆపే ప్రయత్నం చేస్తుండగా గోడను ఢీకొట్టింది. ఈ క్రమంలో లారీ క్యాబిన్ డోర్ గోపాల్ ఛాతిని బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడ్ని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స అందిస్తుండగా గోపాల్ టుడు మృతి చెందాడు. మహారాణిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు వ్యక్తుల మధ్య ఘర్షణ: కత్తితో దాడి

కూర్మన్నపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వివాహిత పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నాడన్న అనుమానంతో రేగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కత్తిలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం జరిగింది. దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు మద్దివానిపాలేనికి చెందిన వివాహితపై మద్ది సతీష్‌రెడ్డి తరచూ అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. ఇటీవల విదేశాల నుంచి ఆమె భర్త రావడంతో విషయం అతడికి చెప్పింది. అతడు వరసకు సోదరుడైన అప్పలరాజుకు తెలిపాడు. అతడు శుక్రవారం సతీష్‌రెడ్డితో ఘర్షణ పడడంతో సతీష్‌రెడ్డి తమ్ముడు ఏకాంతరెడ్డి అక్కడకి చేరుకుని అప్పలరాజును నీలదీశాడు. దీంతో ఏకాంతరెడ్డిపై అప్పలరాజు కత్తితో దాడిచేశాడు.గాయపడిన ఏకాంతరెడ్డిని చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అప్పలరాజును అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.